తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శుక్రవారం
14 ఆగస్టు 2026

# ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 13(జనంసాక్షి):** జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించి, సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.

గురువారం తహసీల్దార్లతో నిర్వహించిన వెబెక్స్ సమీక్షలో అన్ని మండలాల తహసీల్దార్లతో అక్రమ ఇసుక తవ్వకాలపై, భూభారతి, సదాబైనమా, మీసేవ, ప్రజాపాలన, కుటుంబ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పై, ఆగస్టు 15 న స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పై సమగ్రంగా చర్చించారు.

ముఖ్యంగా కోయిల్‌కొండ, మూసాపేట, మిడ్జిల్, దేవరకద్ర, చిన్నచింతకుంట, జడ్చర్ల తదితర మండలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపుపై వచ్చిన ఫిర్యాదులు, నివేదికలను కలెక్టర్ సమీక్షించారు. కోయిల్‌కొండ మండలం శివారం గ్రామంలో ఇసుక తవ్వకాల కారణంగా ప్రభుత్వ భూమికి నష్టం జరిగినట్లు వచ్చిన నివేదికపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ తవ్వకాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. మిడ్జిల్ మండలం లో సీజ్ చేసిన ఇసుక వేలం వెంటనే నిర్వహించాలని మైనింగ్ శాఖ అధికారులను, తహశీల్దారు ఆదేశించారు .

క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని సంబంధిత తహసీల్దార్లు స్వయంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని, అక్రమంగా తరలించిన ఇసుక

మిగతా 9లో..




వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి నిబంధనల ప్రకారం బాధ్యుల నుంచి రికవరీ చేయాలని సూచించారు. అవసరమైన చోట పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేసి, అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మీడియాలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి వ్యతిరేక వార్తలు వచ్చినప్పుడు సంబంధిత తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి, తీసుకున్న చర్యలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి పరిస్థితిని స్వయంగా తెలుసుకోవాలని ఆదేశించారు.

అధికారులు ఒకరిపై మరొకరు బాధ్యతలు బదిలీ చేసుకునే పరిస్థితి ఉండకూడదని, తమ పరిధిలో జరుగుతున్న ప్రతి అంశంపై తహసీల్దార్లకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు.

# పరేడ్ ప్రాక్టీస్‌ను పరిశీలించిన అదనపు ఎస్పీ రియాజ్




**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 13(జనంసాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించే దుకు నారాయణ పేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న పరేడ్ ప్రాక్టీస్‌ను అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్‌హక్ గురువారం పరిశీలించారు. ఆగస్టు 15న నిర్వ హించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్ సిబ్బందితో నిర్వహిస్తున్న పరేడ్ రిహార్సల్స్‌ను మార్చ్‌పాస్ట్, కవాతు, బ్యాండ్ సమ న్వయం తదితర అంశాల ను అదనపు ఎస్పీ పరిశీ లించారు.పరేడ్‌లో సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, సమన్వయం, ఏకరూపత పాటించాలని అదనపు ఎస్పీ సూచించారు.ఈ పరేడ్ రిహార్సల్స్‌కు ఆర్ఐ విజయ్ భాస్కర్ పరేడ్ కమాండర్ గా నిర్వహిస్తు న్నారు. సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

# మానవపాడు మండలంలో MRO ఆఫీసిలో సిబ్బంది కొరత.. ప్రజలకు తప్పని ఇబ్బందులు

**మానవపాడు, ఆగస్టు 13(జనంసాక్షి):**

మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ రేవు నివ్వు ఇన్స్పెక్టర్ కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వివిధ పనులకు సంబంధించిన ఫైళ్లు ముందుకు కదలకపోవడంతో ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో వేచి చూసినా పనులు పూర్తికాకపోవడంతో నిరాశతో ఇంటికి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై వీ:ూ వివరణ కోరగా, "సిబ్బంది కొరత చాలా ఉంది" అని తెలిపారు. సిబ్బంది కొరతను వెంటనే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# దేవరకద్ర గురుకుల కళాశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- **TGSWRS జూనియర్ కాలేజీ, హాస్టల్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీలు**

**దేవరకద్ర, ఆగస్టు 13(జనంసాక్షి):**



ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మౌలిక వసతులు, హాస్టల్ సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, విద్యా ప్రమాణాలు, హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల సమస్యలు, అవసరాలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను సూచించారు.ఈ తనిఖీలో దేవరకద్ర ఎం.పి.ఓ, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# దత్తక్షేత్రంలో హీరో శ్రీకాంత్ సందడి

**మక్తల్, ఆగస్టు 13 (జనంసాక్షి):**



మక్తల్ మండలంలోని పసుపుల వద్ద పవిత్ర కృష్ణా నది ఒడ్డున వెలసిన శ్రీ దత్త క్షేత్రాల్లో ప్రముఖ హీరో శ్రీకాంత్ సందడి చేశారు. హీరో శ్రీకాంత్ పవిత్ర శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా గురువారం రోజు దత్త క్షేత్రానికి మిత్రులతో కలిసి వచ్చారు. పసుపుల గ్రామం వద్ద వెలసిన శ్రీ క్షేత్ర శ్రీ వల్లభపురం దత్త క్షేత్రం వద్ద ప్రవహిస్తున్న కృష్ణానది నది ఆవలి ఒడ్డున ఉన్న కురువపురం దత్తక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు స్వామివారి దర్శనం అనంతరం తిరిగి స్టీమర్ లో శ్రీపాద శ్రీ వల్లభాపురం దత్తక్షేత్రంలోనూ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.

# పెబ్బేరు-కొల్లాపూర్ రహదారిపై సేరిపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం నత్తనడక

- **వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా త్వరగా పనులను పూర్తి చేయాలని సర్పంచ్ డిమాండ్**

**శ్రీరంగాపూర్, ఆగస్టు 13(జనంసాక్షి):** పెబ్బేరు నుండి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై సేరిపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సేరిపల్లి సర్పంచ్ ఎం. వెంకటయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ బ్రిడ్జి పూర్తి కాకపోవడం వల్ల రోజూ వందలాది వాహనాలు, విద్యార్థులు, రైతులు ఇబ్బంది పడు తున్నారని చెప్పారు. ఇప్పటికే పలు చిన్న చిన్న ప్రమాదాలు జరిగాయని, వర్షం వస్తే పరిస్థితి మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వర్షాకాలంలో వాగు ఉధృతికి రహదారి పూర్తిగా బంద్ అవుతోందని తెలిపారు. దీంతో వెంకటాపూర్, శ్రీరంగాపూర్, కంబాలాపూర్, కంచిరావుపల్లి మీదుగా పెబ్బేరు, హైదరాబాద్, కర్నూలు, వెళ్లాల్సి వస్తోందని, దాదాపు 20 కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి



రావడం ప్రజలు నానాక ఇబ్బందులు పడుతున్నారు. కావున సంబంధిత అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచ్ ఎం.వెంకటయ్య యాదవ్ కోరారు.

# జనాభా లెక్కలతోనే సరైన అభివృద్ధి

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ బ్యూరో, ఆగస్టు 13(జనంసాక్షి):**

జనగణన 2027 సన్నాహకాల్లో భాగంగా జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ అత్యంత ప్రామాణికమైనదని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఆర్డీవోలు, తాహాసిల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ తయారీపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధమైన భవిష్యత్తు అభివృద్ధికి జనాభా లెక్కలు దోహదం చేస్తాయన్నారు . గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి రంగం సమగ్ర సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.

జనగణన 2027 సన్నాహకాల్లో మున్సిపల్, విద్య, వైద్య ఆరోగ్య, హౌసింగ్, ఆర్ అండ్ బీ వంటి వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల వారీగా జనాభా వివరాలు నమోదు చేయడం.మౌలిక వసతులు, విద్య, వైద్యం పౌర సౌకర్యాల సమాచారం సేకరించడం.డిజిటల్ యాప్‌లు లేదా వెబ్ పోర్టల్స్ ద్వారా ఖచ్చితమైన డేటాను క్రోడీకరించడం.



రెవెన్యూ గ్రామాల స్థాయిలో అధికారుల ద్వారా పర్యవేక్షణ జరపడం. చేయాలన్నారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ, బవయ్య, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తున్న కేంద్రం

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్
- ప్రజాచైతన్య యాత్రకు తరలిన సీపీఐ నాయకులు



**చేర్యాల, ఆగస్టు 13(జనంసాక్షి):** ఎరువుల ధరలు విపరీతంగా పెంచి కేంద్రం పేద రైతుల నడ్డి విరుస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర గురువారం హుస్నాబాద్‌కు చేరుకుంది. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన బహిరంగ సభకు చేర్యాల ప్రాంతం నుండి సీపీఐ నాయకులు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ నిరుపేదలను, వ్యవసాయ రంగాన్ని అణిచివేస్తోందని ఆరోపించారు. రైతులు, విద్యార్థుల పోరాటాలతో కేంద్రంలో కొన్ని చట్టాలను కాపాడుకున్నామని అన్నారు. యాప్‌ల పేరుతో రైతులకు సకాలంలో ఎరువులు అందకుండా చేస్తున్నారని, ఎరువుల ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ చైతన్యం చేయడమే ప్రజాచైతన్య యాత్ర అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ విధానాలు మార్చుకోకుంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, సిపిఐ కొమురవెల్లి మండల కార్యదర్శి కుడిక్యాల బాల్ మోహన్, ధూల్మిట్ట మండల కార్యదర్శి వలబోజు నరసింహా చారి, మద్దూరు మండల కార్యదర్శి జంగిలి యాదగిరి, గూడెపు సుదర్శన్, శ్రీనివాసరెడ్డి, మల్లేశం, రాజు, పోషయ్య, నర్సింహులు, శ్రీనివాస్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించబోతున్న సీఎం రేవంత్ రెడ్డి

- జగ్గారెడ్డి, నిర్మల స్పష్టం



**సంగారెడ్డి, ఆగస్టు 13 (జనంసాక్షి):** ఈనెల 15న సంగారెడ్డి పట్టణానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్న విషయం తెలిసిందే. సంగారెడ్డి పట్టణం లోని ఐబీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ గార్ల విగ్రహాలను ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్క రించనున్నారు. గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డిలు విగ్రహాలు నెలకొల్పిన స్థలాన్ని అధికారులు,నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు.
సీఎం చేతులమీదుగా విగ్రహ ఆవిష్కరణ జరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఏర్పాట్లను అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ సమయంలో సీఎం తో పాటు ఎవరెవరు పాల్గొంటారో అధికారులకు వివరించారు.
ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి అంజనేయులు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, నాయకులు రఘు గౌడ్,జార్జ్, కూన సంతోష్,కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్, ప్రవీణ్ , సందీప్ రెడ్డి, మొగులయ్య, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఉచిత యూనిఫాం పథకం

- విద్యార్థినీ, విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



**బెజ్జంకి, ఆగస్టు13,(జనంసాక్షి):** మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఎర్రల జానకిరాజు హాజరై విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రాల జానకి మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఉచిత యూనిఫాం పథకాన్ని అమలు చేస్తోంది అని అన్నారు.విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, మండలానికి, జిల్లాకు సైతం మంచి పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ,వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వీఓ అధ్యక్షురాలు ముత్యం శోభ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రేగోడ్‌లో బిజెపి ఆధ్వర్యంలో ర్యాలీ

- హర్ ఘర్ తిరంగ్ పేరిట ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి
- రేగోడు మండల బిజెపి కార్యకర్తలు



**రేగోడ, ఆగస్టు13(జనంసాక్షి):** గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వారి ఆదేశాల మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పథకాన్ని ఎగరవేయాలని సూచించారు. ఈ మేరకు మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా బిజెపి కార్యకర్తలు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష మేరకు చేపట్టిన హర్ గర్ తిరంగ్ పేరిట ప్రతి ఇంటిపై మండలంలోని ప్రతి ఒక్కరు పార్టీలకు అతీతంగా జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు సతీష్ గౌడ్,ఆర్ ఇటిక్యాల గ్రామ పార్టీ అధ్యక్షుడు శివకుమార్,దళిత మోర్చా అధ్యక్షుడు బత్తినిచందు, బిజెపి కార్యకర్తలు శంకర్,దత్తు, ప్రశాంత్ రెడ్డి,సర్జన వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం



**సంగారెడ్డి, ఆగస్టు 13(జనంసాక్షి):** సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి అనిత మృతి ఘటనపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటకూర్ మండలం బ్రిగూడెం గ్రామానికి చెందిన 33 ఏళ్ల అనిత ప్రసవం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. పెళ్లైన 12 ఏళ్ల తర్వాత గర్భం దాల్చిన అనితను కుటుంబ సభ్యులు ఎంతో ఆశతో ఆసుపత్రికి తీసుకువచ్చారని, అయితే చివరకు ఆమె మృతిచెందడం అత్యంత విషాదకరమని ఎమ్మెల్యే అన్నారు.
అనిత ఆసుపత్రికి వచ్చిన సమయంలో పెద్దగా ఆరోగ్య సమస్యలు లేవని కుటుంబ సభ్యులు చెబుతున్నారని, ప్రసవ సమయంలో వైద్యులు సరైన సమయంలో స్పందించి అవసరమైన అత్యవసర వైద్యం అందించి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా మారేది కాదని ఎమ్మెల్యే ఆరోపించారు. ఒక గర్భిణి ప్రాణం కాపాడాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం అందక ప్రాణం పోవడం అత్యంత బాధాకర మైన విషయం అని అన్నారు.

**వైద్యుల నిర్లక్ష్యానికి పేదల ప్రాణాలే బలికావాలా?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రులపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఘాటుగా విమర్శించారు. ఆసుపత్రుల్లో మందుల కొరత, వైద్యుల నిర్లక్ష్యం, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో స్పందించకపోవడం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు.
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేది పేద ప్రజలే. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలే ప్రభుత్వ వైద్యంపై ఆధారపడతాయి. అలాంటి పేదల ప్రాణాల విషయంలో కూడా నిర్లక్ష్యం చేస్తే ఇక వారు ఎవరిని ఆశ్రయించాలి? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

**"మళ్లీ సర్కారు దవాఖానకు రాము" అనే పరిస్థితి ఎందుకు వచ్చింది?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని ఎమ్మెల్యే అన్నారు. "ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే ఉచిత వైద్యం దొరుకుతుందనే నమ్మకం ఉండేది.. ఇప్పుడు ప్రాణాలతో తిరిగి వస్తామా లేదా అనే భయం ఏర్పడుతోంది" అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.
మందులు అందుబాటులో లేకపోవడం, వైద్యుల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల వైపు చూడటానికే భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

**నకిలీ వైద్యుల ఆరోపణలపై తనిఖీలు ఏవి?**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అర్హతలు లేని వ్యక్తులు వైద్యం అందిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కనీస తనిఖీలు నిర్వహించడం లేదని ఎమ్మెల్యే ఆరోపించారు. వైద్యం విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా ఒక మనిషి ప్రాణాన్ని బలితీసుకునే ప్రమాదం ఉంది. అలాంటి సున్నితమైన వ్యవస్థను అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఎలా నిర్వహిస్తారు? అని ప్రశ్నించారు.

**అనిత మృతిపై సమగ్ర విచారణ జరపాలి**

అనిత మృతి ఘటనపై ప్రభుత్వం వెంటనే సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యం నిజమని విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
అనిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు, వైద్యులు, మందులు, సిబ్బంది అందుబాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.
"ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు చివరి ఆశ. ఆ చివరి ఆశనే ప్రభుత్వం దూరం చేస్తే పేదల పరిస్థితి ఏమిటి? ఆసుపత్రుల్లో నిర్లక్ష్యానికి ఇకనైనా అడ్డుకట్ట వేయాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వ్యవస్థను సహించేది లేదు" అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.

## మానవ సేవే మాధవ సేవ: పేదలకు సేవ చేయడమే నా భాగ్యం. భాస్కర్ నాయక్



**మిడ్జిల్. ఆగస్టు 14(జనంసాక్షి):** మానవ సేవే మాధవ సేవ" అనే నినాదంతో ముందుకు సాగుతున్న నాయకుడు జరుపుల భాస్కర్ నాయక్ పేద ప్రజలకు సేవ చేయడంపై తన అంకితభావాన్ని చాటుకున్నారు. సమాజంలో వెనుకబడిన, పేద ప్రజలకు సేవ చేయడంలోనే తనకు నిజమైన ఆనందం, తృప్తి లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని. వివిధ గ్రామపంచాయతీ తండాలలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అవసరం ఉన్నచోట మంచినీటి బోర్లు పేద ప్రజల అనారోగ్యంకి ఆర్థిక సాయం విద్య కోసం చేయూతనిస్తూ ఆపదని వస్తే ఆదుకునే మనస్తత్వం ఉన్న వ్యక్తి భాస్కర్ నాయక్. తండాలలో అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ అదేవిధంగా వివిధ గ్రామాలలో కుల మతాలకతీతంగా దేవాలయాల. చర్చిలకు జాతీయ నాయకుల విగ్రహాలకు యూత్ కు అండగా ఉంటూ ఆర్థిక సాయం అందజేస్తున్నారు.తాజాగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దీన జనులకు సేవ చేసే భాగ్యాన్ని ఆ భగవంతుడే నాకు ప్రసాదించాడని భావిస్తున్నట్లు చెప్పారు. పేద ప్రజల ముఖాల్లో నవ్వులు చూసినప్పుడు, వారిని ఆదుకుంటున్నప్పుడు తనకు ఆ దేవుడే ప్రత్యక్షంగా కనిపిస్తున్నట్లు భాస్కర్ నాయక్ భావోద్వేగంతో వెల్లడించారు.తాను చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు కేవలం బాధ్యత మాత్రమే కాదని, భగవంతుడు తనకు అప్పగించిన పవిత్రమైన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పేద ప్రజల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని, తన సేవా ప్రస్థానం ఇలాగే కొనసాగుతుందని భాస్కర్ నాయక్ ఈ సందర్భంగా తెలియజేశారు . ఈ కార్యక్రమంలో పలు తండాల యువకు నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొని భాస్కర్ నాయక్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. రాబోయే కాలం లో పేద ప్రజల శ్రేయస్ కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందే విధంగా కార్యక్రమాలు చేపడతానని అన్నారు. త్వరలోనే వాహనదారులకు ఎలిమెంట్ల పంపిణీ చేసే కార్యక్రమం చేయబోతున్నట్లు అనే ప్రకటించారు.

## దమ్మకపల్లి సర్పంచ్ జ్యోతి బాలస్వామిని పరామర్శించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

కొండపాక, ఆగస్టు 13(జనంసాక్షి): కొండపాక మండలం దమ్మకపల్లి గ్రామ సర్పంచ్ జ్యోతి బాలస్వామి అత్త ఇటీవల అనారోగ్యంతో మర ణించినందున వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మరియు గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ గారితో కలిసి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ జ్యోతి బాలస్వామి కుటుంబంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం చాలా బాధగా ఉందని వారి కుటుంబానికి ఆ భగవంతుడు పరిస్థితులను తట్టుకునే ధైర్యాన్ని ఇచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, మాజీ రైతుబంధు కన్వీనర్ ర్యాగల్ల దుర్గయ్య, నాయకులు పాల రమేష్ గౌడ్, అంబటి భానుచందర్ గౌడ్, చిట్టి నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ భరత్ పటేల్,గ్రామ అధ్యక్షుడు కూరటి రమేష్, మేకల మల్లేశం, తోకల సంపత్, దొమ్మాట చంద్రశేఖర్, గుర్రాల రాజు, చిక్కుడు భాను, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమాలు పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చేయాలని సీఎంని అడ్డుకుంటాం

- అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వ అధికారులు
- మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి డిమాండ్




సంగారెడ్డి, ఆగస్టు 13(జనంసాక్షి): కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులలో అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వ అధికారులని ఉద్యోగం నుంచి తొలగించా లని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు గురువారం స్థానిక సుందరయ్య భవన్లో సిఐటియూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు.

ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్య దర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మెడికల్ కళాశాల, ప్రభుత్వ హాస్పిటల్లో నోటిఫికేషన్ లేకుండా ఏజెన్సీలు తన ఇష్టానుసారంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాల లో అక్రమాలకు పాల్పడ్డా ఇప్పటివరకు ఏజెన్సీల పైన ప్రభుత్వము చర్యలు తీసుకోకపోవడం కారణ మేంటని అన్నారు ప్రభుత్వ అధికారులు ఏజెన్సీలకు వత్తాసు పలుకుతున్నారని ఈ సందర్భంగా ఈ నెల 15న జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి గారితో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలు రద్దు చేయాలని సీఎం ని కలిసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో అక్ర మాలకు పాల్పడుతున్న అన్ని విషయాలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు ఇప్పటివరకు ఒక్క 197 పోస్టులలో అక్రమాలకు నిలయంగా ప్రభుత్వ ఉద్యోగులు తయారయ్యారు తప్ప ఇంకోటి కాదని అన్నారు ఒక్కొక్క ఉద్యోగానికి 3, లక్షల నుండి 5 లక్షల రూపాయలు తీసుకొని వాళ్లకు ఆర్డర్ కాపీలు ఇస్తున్నారు తప్ప నిజమైన లబ్దిదారులకు మాత్రం ఉద్యోగాలు రావడం లేదని అన్నారు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలు పేరు మీద నోటిఫికేషన్ వేయకుండా ఎలా రిక్రూట్మెంట్ చేస్తారని అన్నారు అందులో పని చేస్తు న్న అధికారులు ఎవరికి చెప్పకుండా ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని అన్నారు కార్మికులకు మేలు చేయాల్సిన అధికారులే ఇలా చేయడం ఏంటని అన్నారు. నోటిఫికేషన్ వేయ కుండా ఉద్యోగాలు తీసుకున్న వారిని తొలగించి వారి స్థానంలో అందులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులందరూ ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభు త్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు, పెంటయ్య, శ్రీనివాస్ గౌడ్, రాజు, మల్లేశం, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను తిప్పికొట్టిన బీఆర్ఎస్ నేతలు

సంగారెడ్డి, ఆగస్టు 13(జనంసాక్షి): కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతల తీరుపై మండి పడ్డారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంగారెడ్డి అభివృద్ధికి కృషి చేయాల్సిన కాంగ్రెస్ నేతలు సత్యదూరమైన ఆరోపణలు, విమర్శలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. విమర్శలు చేయడం మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని, కాంగ్రెస్ నేతలు తమ భాషను మార్చుకోవాలని హెచ్చరించారు. రాజకీయాల్లో సంస్కారంతో మాట్లాడాలని, వ్యక్తిగత విమర్శలకు దిగితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు. ఎవరో చెప్పిన మాటలను పట్టుకుని మాట్లాడకుండా వాస్తవాలు తెలుసుకుని మాట్లా డాలని సూచించారు.



విక్రాంత్....! వార్డులో డిపాజిట్ కూడా సాధించలేని వారు పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ముందు గా ప్రజల మద్దతు ఏంటో నిరూపించుకుని ఆ తర్వాత మాట్లాడాలని సవాల్ విసిరారు. ఎవరి స్థాయి, ఎవరి రాజకీయ బలం ఏంటో ప్రజలకు తెలుసని అన్నారు. సంగారెడ్డి అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ చేసిన పనులను ప్రజలు మరిచిపోలేదని, ఆరోపణలు, విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు ఇకనైనా వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా "సత్యదూరపు మాటలు మానుకుని ప్రజల కోసం పనిచేయండి.. వ్యక్తిగత విమర్శలు చేస్తే మాత్రం తగిన రీతిలో సమాధానం ఇస్తాం" అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, గౌతమ్, చందు, అజీమ్, చింటూ ,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## గీతన్నల హామీల అమలుకు చైతన్య యాత్ర

సంగారెడ్డి, ఆగస్టు 13(జనంసాక్షి): కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయా లని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా గీతన్నల చైతన్య బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలో బుధవారం గీతన్నల చైతన్య బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికి బైక్ ర్యాలీ నిర్వహించారు.



ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గౌడ సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటా యించాలని, గీత కార్మికుల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచాలని, ప్రమాదాల్లో మృతిచెందిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాటమయ్య రక్షణ కవచాన్ని అర్హులైన గీత కార్మికులందరికీ అందించాలని, నీరా ప్రాజెక్టును ప్రారంభించి, బడ్జెట్‌లో కేటాయించిన నిధులను విడుదల చేయాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సీపీఎం నాయ కులు, గీత కార్మికులు పాల్గొని యాత్రకు మద్దతు తెలిపారు.

## రక్తదానం మహాదానం

- మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్



శివ్వంపేట, ఆగస్ట్ 13(జనంసాక్షి): ప్రజల హృదయాలలో స్థిర స్థాయిలో నిలిచిపోయిన దివంగత నేత, శివ్వంపేట మాజీ జెడ్పిటిసి వాకిటి లక్ష్మారెడ్డి 27వ వర్ధంతి వేడుకలు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పర్యవేక్షణ లో జరగనున్నాయని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన శివంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ఈ నెల 15 న శివ్వంపేట మాజీ జడ్పీటీసీ వాకిటి లక్ష్మారెడ్డి వర్ధంతి వేడుకలను లక్ష్మారెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నర్సాపూర్లో రక్తదాన శిబిరం నిర్వహించడం జరుగుతుందని, రక్తదానం మహాదానమని, ఇకముందు కూడా ఇటువంటి సామాజిక సేవా కార్య క్రమాలు కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా చదువులో మంచి నైపుణ్యం ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు విద్యా వికాస్ అవార్డులను అందించడం జరుగుతుంది కాబట్టి నియోజవర్గ పరిధిలోని మెరిట్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో రావాలని ఆయన సూచించారు. ఈ నెల 15 న ఉదయం 9 గంటల నుంచి లక్ష్మారెడ్డి మెమోరియల్ చారి టబుల్ ట్రస్ట్ రక్తదాన శిబిరానికి జిల్లాలోని సర్పంచులు, లక్ష్మారెడ్డి అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని రమణ గౌడ్ కోరారు. ఈ సమావేశం లో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, గూడూరు ఉప సర్పంచ్ వెంకటేష్, నాయకులు లక్ష్మీ నరసయ్య తదితరులు ఉన్నారు.

## నూతనంగా బాధితులు స్వీకరించిన ఎక్సైజ్ అధికారికి శాలువాతో సన్మానం

నిజాంపేట, ఆగస్టు 13 (జనంసాక్షి): నస్కల్ గౌడ సంఘం సభ్యులు నూతనంగా బాధ్యతలు స్వీకరిం చిన ఎక్సైజ్ సూపరిం టెండెంట్ ఎల్. నర సింహారెడ్డి, కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌ను మర్యాదపూర్వ కంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్కల్ గౌడ సంఘం అధ్యక్షుడు రామగౌడ్, ఉపాధ్యక్షుడు లింగంగౌడ్, సభ్యులు పర్శ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



## బాలల అసభ్య వీడియోలు పంచిన ఆరుగురిపై కేసులు

కల్హేర్, ఆగస్టు13(జనంసాక్షి): కల్హేర్ మండలం మార్డి గ్రామానికి చెందిన ఆరుగురిపై బాలల అసభ్య వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచినందుకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గత ఏడాది ఈ వీడియోలను ఇతరులకు పంపినట్లు భారత సైబర్ నేర సమన్వయ కేంద్రం గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గతంలో ఒకరిపై కేసు నమోదు చేయగా, తాజాగా మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటువంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే పోక్సో చట్టం సెక్షన్ 15, సమాచార సాంకేతిక చట్టం సెక్షన్ 67(బి) కింద కేసులు నమోదు అవుతాయని పోలీసులు హెచ్చరించారు.

## గంగాధర్‌కు బంజారా సమ్మేళనం ఆహ్వానం

శివ్వంపేట, ఆగస్ట్ 13(జనంసాక్షి): ఈ నెల 23న జరుగబోయే బంజారా అసోసియేషన్ సమాజ ఐక్యత, అభి వృద్ధి భవిష్యత్తు కార్యాచరణపై చర్చిం చేందుకు బీసీ, ఎస్టీ, ఎస్సి, బంజారా అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతి నిధి బండారి గంగాధర్‌ను శుక్రవారం బంజారా నాయకులు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంజారా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ నాజం నాయక్, రాజు నాయక్, వేణు నాయక్, శంకర్ నాయక్, రాజు యాదవ్ తదితరులు ఉన్నారు.



## జూనియర్ కళాశాలలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

- నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదవాలి: ప్రిన్సిపాల్ శోభారాణి

పెద్దశంకరంపేట, ఆగస్టు 13(జనంసాక్షి): పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఉచిత నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల చదువుకు అవసరమైన నోట్‌బుక్స్ ఉచితంగా అందడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి ఫలితాలు సాధించాలని అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు ప్రభాకర్, అనంత రాజ్ శర్మ, మల్లేశం, రాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి): రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుండి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. జిల్లాలోని పంటల వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు , సెప్టెంబర్ మాసాలలో ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తు న్నారని, వరి పంటను సాగు చేస్తున్న రైతులు వరి సాగు కోసం ఎక్కువ నీరు అవసరం అవుతుందని, ఆగస్టు సెప్టెంబర్ మాసాల్లో వర్షాలు తగ్గడం వల్ల వరి పంటలు ఎండి పోయే అవకాశం ఉందని, పంటలు ఎండి పోవడం వల్ల దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులపై వ్యవసాయ అధికారులు గ్రామా ల్లోని గ్రామ సర్పంచులకు, రైతులకు ఆరు తడి పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, విస్తరణ అధికారుల తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణిలో ధన్వాడ నాగరాజు వినతి ఫలించింది..

- ప్రభుత్వ, దేవాదాయ భూముల రక్షణకు డా. జి. చిన్నారెడ్డి హామీ

గోపాల్‌పేట, ఆగస్టు 13(జనంసాక్షి): బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ప్రజావాణి కార్యక్రమంలో గోపాల్‌పేట మండలానికి చెందిన సామాజిక కార్యకర్త ధన్వాడ నాగరాజు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహా దారు డా.జి.చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, దేవాదాయ శాఖకు చెందిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని వెంటనే పరిరక్షించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వినతిపత్రంలో సర్వే నంబర్లు 425, 392, 422లో ఉన్న ప్రభుత్వ, దేవాదాయ భూములపై జరుగుతున్న ఆక్రమణలను ప్రస్తావిస్తూ, గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని వివరించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన ఈ భూములను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డా. జి. చిన్నారెడ్డి సమస్యను సానుకూలంగా పరిశీలించి, వనపర్తి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే విచారణ చేపట్టించి, ప్రభుత్వ భూములను రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ, దేవాదాయ భూములు ప్రజల ఆస్తులని, వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ధన్వాడ నాగరాజు పేర్కొన్నారు. ప్రజావాణిలో తన వినతికి స్పందన లభించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, ఆక్రమణల తొలగింపులో అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పంచాయతీ భవనానికి నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన దాతలు

అమరచింత, ఆగస్టు 13(జనంసాక్షి): మండల పరిధిలోని చంద్ర నాయక్ తండాలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన గ్రామ సర్పంచ్ తల్లి జయమ్మ రాముల నాయక్ రెండు కుంటలో భూమిని విరాళంగా అందజేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన బిజెపి పార్టీ గ్రామ అధ్యక్షుడు వి రమేష్ నాయక్ తండ్రి తార్య నాయక్ ఒక కుంట భూమి స్థలం అందజేశారు. ఈ భూమి గ్రామపంచాయతీ భవనం నిర్మాణం కోసం ఈ స్థలం ఇచ్చిన నందుకు గ్రామానికి గుర్తుండే విధంగా అంద చేసినందుకు అధికారులు ప్రజలు అభినందించారు. ఈ రిజిస్ట్రేషన్ పట్టా ను సబ్ రిజిస్టర్ తాసిల్దార్ రవికుమార్ కు అందజేశారు. ఈ పట్టాను చంద్ర నాయక్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ సుచిత్ర కు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణా నాయక్ మూడో వార్డు సభ్యులు కురుమనాయక్ జయమ్మ వి రమేష్ నాయక్ చంద్ర నాయక్ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసిన దాతలను మరువ రానిది గ్రామ ప్రజలు అన్నారు.

# వెల్దుర్తిలో రిలే నిరాహార దీక్షలు

- తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తిలోనే ఏర్పాటు చేయాలి



వెల్దుర్తి, ఆగస్టు 13(జనంసాక్షి): వెల్దుర్తి మండలానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తి పట్టణంలోని ఏర్పాటు చేయాలని శుక్రవారం పట్టణ యువకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు ముఖ్యంగా ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను వెల్దుర్తిలో ఏర్పాటు చేయడం వల్ల వెల్దుర్తి చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని మారుమూల గ్రామాలకు తరలించడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారని జేపీసీ నాయకులు అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం మరియు అధికారులు స్పందించి వారి ఆలోచనను విరమించుకొని వెల్దుర్తి పట్టణంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను త్వరలో ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు కోదండ కృష్ణ గౌడ్ నాల చెరువు నరేందర్ గౌడ్ అంగడిపేట మహేందర్ గౌడ్, గోనేష్, నల్లచెరువు ప్రవీణ్ గౌడ్, మంగలి ప్రేమ్, కుమ్మరి పవన్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల సమస్యలపై తాసిల్దార్‌కి మెమోరాండం సమర్పించిన టీఎస్ యుటిఎఫ్



మాగనూర్, (జనంసాక్షి): ఉపాధ్యాయుల సమస్యలపై తహసీల్దార్‌కి మెమోరాండం సమర్పించిన టీఎస్ యుటిఎఫ్ (TSUTF) మాగనూర్ మండల శాఖ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (USPC) దశలవారీ పోరాటంలో భాగంగా మాగనూరు మండల తహసీల్దార్ కి మెమోరాండం ఇవ్వడం జరిగింది. టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఈ క్రింది డిమాండ్స్ విన్నవించారు. పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని 6 విడతల డి.ఎను ప్రకటించాలని ప్రధానమైన డిమాండ్లతో పాటు 29 ఉపాధ్యాయ రంగ సమస్యల పై మెమోరాండం ఇవ్వడం జరిగింది. సిపిఎస్‌ని రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను పకడ్బందీగా అమలు చేయాలని ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో (TSUTF) టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు శంకర్, అనిత, జమ్మన్న, రామకృష్ణ చారి, విజయలక్ష్మి, రమా, మహేశ్వరి, దేవి, కళావతి, గోపాల్, సంజన, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు ప్రశాంతత చేకూరుస్తాయి

- సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్



నారాయణపేట, ఆగస్టు 13(జనంసాక్షి): క్రీడలు మానసిక శారీరక ప్రశాంతత కలిగిస్తాయని నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అన్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా గురువారం నారాయణపేట లో కోర్టు జడ్జిల జట్టు, న్యాయవాదుల జట్ల మధ్య క్రికెట్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాద వృత్తిలో ఎప్పుడూ వత్తిడి లో వుండే న్యాయవా దులు,జడ్జిలు స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడడం ఎంతో ఆసక్తి కలిగించిందన్నారు. ఆటవిడుపు తో వత్తిడి దూరం అవుతుందన్నారు. ఈ పోటీలో విజయం సాధించిన న్యాయవాదుల జట్టును ఆమె అభినందించారు.

# వ్యవసాయ పనులు చేస్తుండగా గుండెపోటుతో మృతి



చేర్యాల, ఆగస్టు 13(జనంసాక్షి): తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా గుండెపోటుకు గురై యువరైతు అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన మండ లంలోని రాంపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండ సాయిలు (40) గురువారం గ్రామంలోని తన వ్యవసాయ భూమి వద్ద పొలంలో పనులు చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై పొలంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో నడుపుతూ వ్యవ సాయం చేసుకుంటూ కుటుంబ బాధ్యతను మోస్తున్న పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అతని మృతితో రాంపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

- డ్రంకన్ డ్రైవ్‌లో వాహనదారుడికి రూ.10 వేల జరిమానా
- కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్



కొల్చారం, ఆగస్టు 13 (జనంసాక్షి): మద్యం సేవించి వాహనా లు నడిపితే కఠిన చర్యలు తప్పవని కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ హెచ్చరించారు. గురువారం మెదక్-హైద రాబాద్ ప్రధాన జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంక న్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలను పరిశీలించడంతో పాటు వాహనదారులకు మద్యం మత్తు పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న విక్రమ్ కుమార్‌ను పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అనంతరం అతనికి రూ.10 వేల జరిమానా విధించి, మెదక్ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. వాహనదారులు బాధ్యతగా వ్యవహరించి మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రంకన్ డ్రైవ్‌పై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్సై స్పష్టం చేశారు.

# సాగునీటితో రైతన్నల్లో ఆనందం వెల్లువ



ఉప్పునుంతల, (జనంసాక్షి): వర్షాలు ఆలస్యం కావడంతో పంటలు వాడుముఖం పట్టి దిగుబడులపై ఆందోళన చెందిన రైతన్నలకు కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ నీరు ఊరట నిచ్చింది. ఎగువ ప్రాంతాల్లో గత కొద్దిరోజులుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. దీంతో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గురువారం ఉప్పునుంతల మండలానికి సాగునీరు చేరడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటలను సాగుచేశారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండుముఖం పట్టడంతో పెట్టుబడులు చేతికొస్తాయా లేదా అన్న ఆందోళన నెలకొంది. ఈ సమయంలో సాగునీరు అందుబాటులోకి రావడంతో పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక పంటలకు నీటి కొరత ఉండదని, ఆశాజనకంగా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కర్పూరం మొక్కలతో పుష్కలంగా ఆక్సిజన్

• రేజింతల్‌లో మొక్కలను నాటిన దంపతులు



**న్యాల్‌కల్, ఆగస్టు13(జనంసాక్షి):** పుష్కలంగా ఆక్సిజన్ అందించే అరుదైన కర్పూరం మొక్కలను మండలానికి చెందిన ఓ దంపతులు నాటారు. మండలంలోని రేజింతల్ గ్రామానికి చెందిన సంజీవ్ కుల్కర్ణి (ప్రస్తుతం నాసిక్ లో నివాసం) దంపతులు మహారాష్ట్ర నాసిక్ నుండి తీసుకువచ్చిన కర్పూరం మొక్కలను గురువారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కర్పూరం మొక్కలవల్ల కలిగే ప్రయోజనాలు, 80/90 అడుగుల ఎత్తులో పెరిగి కార్బన్డయాక్సైడ్ ను స్వీకరించి.. ఆక్సిజన్ విడుదల చేసి ఆరోగ్యాన్ని కాపాడుతుందని పాఠశాల విద్యార్థును లు, సమీప భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురునాథ్, సిబ్బంది వెంకటరెడ్డి, భక్తులు జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యతో జీవిత సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని పెంచుకోవాలి

• కల్నల్ గగన్ దీప్ అరోరా

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 13(జనంసాక్షి):** ఇంజనీరింగ్ విద్య ద్వారా వాస్తవ జీవితం సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కేవలం పుస్తక జ్ఞానం సరిపోదని, ప్రయోగాత్మక అభ్యాసం, క్రిటికల్ థింకింగ్, ఇండస్ట్రీ అవసరాలకు తగిన ప్రాజెక్టుల పై దృష్టి పెట్టడం చాలా ముఖ్యమని '8టిఎన్' ఎన్.సీ.సీ కమాండింగ్ అధికారి కల్నల్ గగన్ దీప్ అరోరా అన్నారు. స్థానిక జయప్రకాష్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం 30వ బ్యాచ్ మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ప్రారంభం నుంచే సమయ పాలన, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనం,సమస్య పరిష్కార దృక్పథం, స్పష్టమైన కమ్యూనికేషన్ వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ రంగంలో విజయానికి సాంకేతిక నైపుణ్యాలతో పాటు టీమ్‌వర్క్, నైతిక విలువలు, సమగ్రత, నాయకత్వ లక్షణాలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. 'యూనిటి అండ్ డిసిప్లిన్' అనే ఎన్.సీ.సీ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశసేవ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎన్.సీ.సీ క్యాడెట్ల కు హితవు పలికారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన క్యాడెట్ నాయకులు ముందుండి ఆదర్శంగా నిలవాలని, జూనియర్లకు మార్గదర్శకత్వం వహించి సేవాభావంతో పనిచేయాలని సూచించారు.




కళాశాల చైర్మెన్ కెవస్ రవికుమార్ మాట్లాడుతూ, కళాశాల స్థాపించి 30 సంవత్సరాల సందర్భంగా 30వ బ్యాచ్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ, తమ కళాశాలలో 17600 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ చదువు పూర్తి చేసుకున్నారని, అనేక మంది విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డవారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా 'బెస్ట్ రూరల్ ఇంజనీరింగ్ కాలేజ్' అవార్డు పొందామని, తెలంగాణ రాష్ట్రంలో ఎన్.సీ.సీ కలిగిన 5 కళాశాలలో జెపిఎన్సీఈ ఒకటి అని ఆయన గర్వంగా చెప్పారు. ప్రతి విద్యార్థి ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని, జాబ్ ఆఫర్ సర్టిఫికెట్ తో వెళ్ళాలనే తమ సంకల్పమన్నారు. అనంతరం 'ఎప్సెట్' లో 20 వేల లోపు సాధించిన 6 గురు విద్యార్థులకు 20 వేల చెక్కులు, ఇంటర్‌లో 900 మార్కుల పైబడి సాధించిన విద్యార్థులకు 3.6 లక్షల విలువైన చెక్కులను అథితులచే అందింపజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వెంకట రామారావు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పరీక్షల నిర్వహణ అధికారి కోటాల సందీప్ కుమార్, బాలగంగాధర్, సందీప్, డా.సంజీవ్ కుమార్, గురు రాఘవేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా పోటీలు





**మునిపల్లి, ఆగస్టు 13(జనంసాక్షి):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన మునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండు రోజులపాటు అంతర్గత క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్తో పాటు వివిధ మైనర్ క్రీడల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల ద్వారా విద్యార్థుల్లో జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందేలా ప్రోత్సహించారు. మునిపల్లిలో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయురాలు మాధవి ఆధ్వర్యంలో పి.డి. కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు మల్లికార్జున్, కల్పన, శ్రీవిద్య, శైలజ, స్వరూపరాణి, సిబ్బంది అష్రఫ్ అలీ, పాషా సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాధవి మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో నిర్వహించిన ఈ అంతర్గత క్రీడా పోటీలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతూ, క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించాయని ఆమె పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

• నవాబుపేట ఎస్ఐ వాకిటి నరేందర్



**నవాబుపేట, ఆగస్టు13(జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా నవాబుపేట పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం మండల పరిధిలోని యన్మాన్ గండ్ల గేటు మూల మలుపు దగ్గర, మహబూబ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను, తుప్పలను జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా నవాబుపేట సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) వాకిటి నరేందర్ మాట్లాడుతూ, రహదారి మలుపుల వద్ద పిచ్చి మొక్కలు సరిహద్దులను కమ్మేయడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఈ పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు. మలుపుల వద్ద వాహనదారులు వేగాన్ని తగ్గించి, జాగ్రత్తగా ప్రయాణించాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## పట్టా భూములను నిషేధిత జాబితాలో తొలగించాలి



**మల్దకల్, ఆగస్టు 13(జనంసాక్షి):** మల్దకల్ మండలం ఎద్దులగూడెం గ్రామ శివారులోని తమ పట్టా భూములను 22.1(ఏ) నిషేధిత జాబితాలో చేర్చడం తమకు తీవ్ర అన్యాయమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులోని సర్వే నంబర్లు 20,28,93, 94లోని పట్టా భూములను 22.1(ఏ)నిషేధిత జాబితాలో చేర్చడంతో భూముల క్రయవిక్రయాలు, ఇతర అవసరాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడానికి గల కారణాలను అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు. 22.1(ఏ) నిషేధిత జాబితా నుంచి తమ పట్టా భూములను వెంటనే తొలగించి, రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని ఆర్డీవో కార్యాలయం ఏవోకు గురువారంవినతి పత్రం సమర్పించారు.

## కంపచెట్లు తొలగించి.. రోడ్లకు కొత్తరూపు





**ఉప్పునుంతల, (జనంసాక్షి):** మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వార్డులో రోడ్లకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించి, రహదారులను శుభ్రం చేయించారు.

ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రోడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. కంపచెట్లు తొలగించడంతో రోడ్లు విశాలంగా మారడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.

## బాలసదనంలో చిన్నారుల సమస్యలను తెలుసుకున్న జిల్లా రెవెన్యూ అధికారి

**అచ్చంపేట రూరల్, ఆగస్టు 13(జనంసాక్షి):** పిల్లల సంక్షేమం, రక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి, ఇంచార్జ్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ డీడబ్ల్యూఓ పాండు అన్నారు. గురువారం అచ్చంపేటలోని బాలసదనాన్ని సందర్శించిన ఆయన అక్కడి చిన్నారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బాలసదనంలోని ప్రతి చిన్నారితో నేరుగా మాట్లాడి వారి వ్యక్తిగత అంశాలు, విద్య, ఆరోగ్యం, భద్రత, వసతులు, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర విషయాలను సావధానంగా ఆలకించారు. చిన్నారులు స్వేచ్ఛగా తమ సమస్యలను, అభిప్రాయాలను వెల్లడించేలా వారితో మాట్లాడారు. పిల్లలు తెలిపిన అంశాలను పరిశీలించి, వారి అవసరాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. బాలసదనంలో చిన్నారులకు అందుతున్న భోజనం, విద్య, వైద్యం, వసతులు, పరిశుభ్రత, భద్రత తదితర అంశాలపై కూడా ఆయన వివరాలు తెలుసుకున్నారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని, వారి పట్ల సిబ్బంది ప్రేమాభిమానాలతో వ్యవహరించాలని సూచించారు. బాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి విద్యాభ్యాసం, మానసిక వికాసం, వ్యక్తిత్వ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.



ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలసదనంలోని చిన్నారులకు ఒక దాత అందజేసిన నూతన వస్త్రాలను జిల్లా రెవెన్యూ అధికారి, డీడబ్ల్యూఓ పాండు చేతుల మీదుగా పంపిణీ చేశారు. నూతన వస్త్రాలు అందుకోవడంతో చిన్నారులు సంతోషం వ్యక్తం చేశారు. బాలసదనంలోని చిన్నారులకు అవసరమైన వస్తువులను దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అందించడం అభినందనీయమని అధికారులు పేర్కొన్నారు. బాలల సంక్షేమం కోసం సమాజంలోని ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలన బాలల పరిరక్షణ విభాగానికి చెందిన టి. శ్రీశైలం గౌడ్, సుదర్శన్, మలేష్ యాదవ్, వేణుగోపాల్, సీడీపీవో శ్రీమతి లక్ష్మి, చిల్డ్రన్ సూపరింటెండెంట్ భాగ్యమ్మతో పాటు బాలసదనం సిబ్బంది పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ



పటాన్చెరు, ఆగస్టు 13 (జనంసాక్షి): గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 2026-27 బ్యాచ్‌కు ఘనంగా ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించి, నూతన విద్యార్థులను ఘనంగా స్వాగతించాయి.

సంగీతం, నృత్యం, స్కిట్లు, ర్యాంప్ వాక్‌లు, విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో గీతం ప్రాంగణమంతా కళకళలాడింది. ఫుడ్ స్టాల్స్, ఆటలు, ఫోటోబూత్ లు పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఫ్రెషర్స్ కు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, తోటి విద్యార్థులు, సీనియర్లతో మమేకమవ్వడానికి ఒక అవకాశాన్ని కల్పించాయి. విద్యార్థులు నేర్చుకోవడానికి, ఒకరితో ఒకరు మమేకమవ్వడానికి, తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, చిరస్మరణీయమైన జ్ఞాపకాలను నిర్మించుకోవడానికి ప్రోత్సహించే ఉత్సాహభరితమైన ప్రాంగణ వాతావరణాన్ని సృష్టించాలనే గీతం నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. తమ విశ్వవిద్యాలయ ప్రయాణానికి ఒక చిరస్మరణీయమైన ఆరంభాన్ని అందించినందుకు ఫ్రెషర్స్ తమ సీనియర్లకు కృతజ్ఞతలు తెలియజేయడంతో, ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# బాలికను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడికి రెండేళ్ల జైలు

- రూ.20 వేల జరిమాన
- నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ



మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి): పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడి వేధింపులకు గురిచేసిన నిందితుడికి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు తెలిపారు. నరేష్ (27) అనే వ్యక్తి పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్ గౌడ్ జులై 2022లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో సమర్పించారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలిక సాక్ష్యం చెప్పడంలో సహకరించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు నరేష్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, సీడీఓ ప్రవీణ్ సహకరించారని ఎస్పీ తెలిపారు. బాలికలు, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. బాధితులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వేధింపులపై వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# ఇచ్చిన హామీ మరిచారా?

- హామీ కోసం ఆశపడ్డ గ్రామస్తులు
- దీక్ష శిబిరాన్ని పట్టించుకోని ఎమ్మెల్యే మేఘారెడ్డిపై గ్రామస్తుల ఆవేదన




రేవల్లి, ఆగస్టు 13(జనంసాక్షి): గత మూడేళ్ల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లాలో కలపాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్న తల్పునూర్ గ్రామస్తుల దీక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఎన్నికల సమయంలో మేఘారెడ్డి 'నేను గెలిచిన వెంటనే మూడు నెలల్లో తల్పునూర్ గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లాలో కలుపుతానని హామీ ఇచ్చారు. కానీ గెలిచి మూడు సంవత్సరాలు దాటినా ఆ హామీ నెరవేరలేదు" అని దీక్ష శిబిరం నిర్వాహకులు గుర్తు చేశారు.

**ప్రోటోకాల్ దాటి వచ్చి, శిబిరం మరిచారు:**

గురువారం తల్పునూర్ గ్రామంలో పీఏసీఎస్ భవన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే తన నియోజకవర్గ సరిహద్దులు, వనపర్తి జిల్లా సరిహద్దులు దాటి ప్రోటోకాల్ మరిచి నాగర్‌కర్నూల్ జిల్లామీదుగా తల్పునూర్ గ్రామానికి చేరుకున్నారు. గ్రామం చివరన ఉన్న పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభించారు. అయితే గ్రామంలో గత రెండు నెలలుగా దీక్ష కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరం దగ్గరికి మాత్రం రాలేదు.

"ఇచ్చిన మాటను కాపాడుకోలేక, హామీని నెరవేర్చలేని నిస్సహాయ స్థితిలో గ్రామంలోకి రాకుండా, శిబిరాన్ని సందర్శించకుండా, గ్రామ సమస్యలను అడగకుండా కేవలం రిబ్బన్ కటింగ్ చేసి తిరిగి అటు నుంచి అటే నాగర్‌కర్నూల్ జిల్లా మీదుగా గోపాల్‌పేట వెళ్లిపోయారు. ఇది చాలా బాధాకరమని దీక్షలో ఉన్న గ్రామస్తులు వాపోయారు. దీక్ష చేస్తున్నా ఒక్కసారి కూడా ఎమ్మెల్యే గానీ, మంత్రి గానీ పట్టించుకోలేదని, కనీసం ఈరోజైనా వచ్చి సమస్య వింటారని ఆశించామని, కానీ నిరాశే మిగిలిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉమామహేశ్వరంలో ఘనంగా మహా వరుణయాగం







అచ్చంపేట, ఆగస్టు13(జనంసాక్షి): శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి చెందిన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం మహా వరుణ యాగాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నల్లమల అడవుల మధ్య ప్రకృతి రమణీయతతో కొలువైన ఉమామహేశ్వర క్షేత్రానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది.

నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు మహా వరుణ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు సస్యశ్యామలంగా వర్ధిల్లాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ యాగాన్ని నిర్వహించినట్లు తెలిపారు. యాగానికి శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ బీరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు, ఆలయ అర్చకులు యాగ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు. భక్తి, ప్రకృతి, ఆధ్యాత్మికతల సంగమంగా నల్లమలలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరం క్షేత్రంలో మహా వరుణ యాగం భక్తులను ఆకట్టుకుంది.

# డ్వాక్రా మహిళ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మహిళల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి
- ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



నంగునూరు, ఆగస్టు 13(జనంసాక్షి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు అన్ని విధాలా అండగా నిలుస్తూ, వారి కార్యకలాపాలకు అనువైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నంగునూరు మండలం నాగరాజుపల్లి గ్రామంలో మహిళా భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, పొదుపు సంఘాల కార్యకలాపాలు కొనసాగించడానికి, మహిళలకు వివిధ ప్రభుత్వ పథకాలు, శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించడానికి మహిళా భవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

మహిళల సంక్షేమం, సాధికారతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా పొదుపు, రుణాలు, చిన్నతరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని యాదగిరి తెలిపారు. మహిళలకు ప్రత్యేక భవనాలు అందుబాటులోకి రావడం వల్ల సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరింత సౌకర్యవంతంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

"డ్వాక్రా మహిళలకు పక్కా భవనాలు కల్పించడం మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. మహిళల సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కెర లింగం, ఏఈ నరేష్, కార్యదర్శి దేవేందర్, మాజీ సర్పంచ్‌లు చేర్యాల బాలయ్య, ముక్కెర వెంకటేశం, బండి రవళి, పాకాల భవాని, దూబ్బుదు దేవేంద్ర,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,మొతెకాని కనకయ్య,తిరుపతి, పాకాల భాస్కర్, రాజు, యాదగిరి,మహిళా సంఘాల సభ్యులు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా... ఐక్యతను చాటుదాం

- బిజెపి నేత నాగురావు నామాజీ



నారాయణపేట, ఆగస్టు 13(జనంసాక్షి): ఘర్ ఘర్ తిరంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన సందర్భంగా గురువారం నారాయణపేటలోని తన నివాసంపై బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం స్వతంత్ర ఉద్యమం నాటికి దేశంలో దాదాపు 10 కోట్ల మంది భారతీయులు తమ తమ ఇళ్లపై 15 ఆగస్టు నాడు మరి అంతకు ముందు మూడు రోజులు జాతీయ జెండాను ఆవిష్కరించి కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడ్డరని అన్నారు.ఆ పిలుపుకు కొనసాగింపుగా ఈ సంవత్సరము ""1942 ఆగస్టు 9న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం"" స్ఫూర్తితో ఆగస్టు 9 నుండి 17 ఆగస్టు వరకు దేశవ్యాప్తంగా ప్రతి ఊరిలో ప్రతి ఇంటి పై భారత జాతీయ జెండాను ఎగురవేసే జాతీ య స్ఫూర్తిని పెంపొందించా లని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు 10వ తేదీ నుండి 15 ఆగస్టు వరకు ప్రతి ఒక్కరూ ఈ "" ఆపూర్వ జెండా ప్రతి ఇంటి పై జెండా"" ఎగరాలని కోరారు.ఇదే స్ఫూర్తితో నారాయణపేట జిల్లా కేంద్రంతో పాటు ప్రతి పల్లెలో ప్రతి ఇంటి పైన జెండాను ఎగుర వేయవల సిందిగా భారతీయులం దరినీ కోరినారు.

ఈ పిలుపును అమలు చేసి దేశద్రోహుల ఆట కట్టివే యాలని ప్రతి ఒక్కరిలో జాతీయ జెండాపై భక్తిని పెంచాలని దేశభక్తిని రగిలించాలని జాతి పునర్ నిర్మాణంలో భాగస్వా ములు కావాలని రాజకీ యాలకు అతీతంగా ప్రతి భారతీయుడు ఈ స్వాతం త్ర దినోత్సవ శుభాకాంక్షలు జాతీయ జెండాలు ఎగుర వేసి మరొకసారి దేశభక్తి, ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ, బిజెపి నాయకులు హనుమంతరావు,కుమార్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల నాగేంద్ర రచించిన భరతమాత గీతం ఆవిష్కరణ చేసిన కలెక్టర్


**మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 13(జనంసాక్షి):** భావి భారత పౌరులు విద్యార్థులకు భరతమాత గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ రచయిత,గాయకుడు తిరుమల నాగేంద్ర రచించిన భరతమాత గీతాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. రాబోయే భవిష్యత్ తరాలకు ఇది చాలా ఆదర్శంగా ఉంటుందని భావి భారత పౌరులైన విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని, నైతిక విలువలను పెంపొందించే విధంగా ఈ గీతం ఉందని కలెక్టర్ గేయ రచయితని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఏ ఎం ఓ దుంకుడు శ్రీనివాస్ ,కవి, రచయిత, ఎం ఎన్ విజయకుమార్ ,స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీని తక్షణమే ప్రకటించి అమలు చేయాలి



**వెల్దండ, ఆగస్టు 13(జనంసాక్షి):** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, తక్షణమే పిఆర్సి ని ప్రకటించి అమలు చేయాలని యూపీఎస్పీ నాయకులు తహసిల్దార్ బీశ్వ కార్తీక్ కుమార్ కు గురువారం వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ డీ.ఏ లను విడుదల చేయాలని, ఉద్యోగులు పెండింగ్ బకాయిల పెన్షన్లు చెల్లించాలని, ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ప్రమేయం ఉండరాదని, ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను కచ్చితంగా నియమించాలని, జీవో నెంబర్ 25ను సవరించాలని, పాఠశాలల కుదింపు ప్రక్రియను విరమించుకోవాలన్నారు. విద్యా రంగం పై స్వచ్ఛంద సంస్థల ప్రభావం ఉండరాదనే మొదలగు సమస్యలను వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, పత్యా నాయక్, అమర్ సింగ్, ఉమాదేవి, లక్ష్మయ్య, సిద్దేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో దొంగతనం



**తూప్రాన్, ఆగస్టు 13(జనంసాక్షి):** తూప్రాన్ పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన కామేష్ అనే వ్యక్తి భార్య గాయత్రి సాయిలక్ష్మితో కలిసి ఈనెల 11న బంధువుల ఇంటికి వెళ్లి వచ్చిన దంపతులకు గురువారం ఉదయం ఇంటికి రావడంతో ఇంటి తాళాలు తలుపులు పగలగొట్టి ఉండడంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగ బీరువాలో 5 తులాల బంగారు ఆభరణాలు, 1.5.(కిలోసర) వెండి వస్తువులు కనిపించకపోవడంతో తూప్రాన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు .విషయం తెలుసుకున్న పోలీసులు సీఐ వెంకట్ రాజా గౌడ్,ఎస్ఐ గంగరాజు,లు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించుమని నిందితుడిని పట్టుకునేశీదుకు కాలనిలో ఉన్న సీసీ టీవీ ఫుటేజ్ ను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఇంటి భద్రత కొరకు ఇంట్లో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఊరికి వెళ్ళేటప్పుడు ఇంట్లో ఎవరు కూడా విలువైన బంగారు, వెండి వస్తువులను ఉంచుకువద్దని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని తూప్రాన్ సీఐ వెంకట్ రాజా గౌడ్ తెలిపారు.

## గీతన్నల చైతన్య యాత్రకు ఘన స్వాగతం



**టేక్మాల్, ఆగస్టు 13(జనంసాక్షి):** రాష్ట్ర బస్సు యాత్రలో భాగంగా టేక్మాల్ మండలం బొద్మట్‌పల్లి లో నిర్వహించిన గీతన్నల చైతన్య యాత్రకు టేక్మాల్ మండల గౌడ సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ చైతన్య యాత్ర రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గీతన్నల సమస్యలు, వారి హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈ యాత్ర కొనసాగుతుందని, ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా యాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం. వి. రమణ, రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశం గౌడ్, జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా నాయకులు వెంకటేష్ గౌడ్, యాదగౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రసాద్ గౌడ్, ప్రతాప్ గౌడ్ పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ విజయవంతం చేద్దాం

- బిజెపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు



**గద్వాల, ఆగస్టు 14(జనంసాక్షి):** దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికి తీసుకెళ్లడమే "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమ లక్ష్యమని బిజెపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. బుధవారం గద్వాల పట్టణంలోని డి.కె. బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు పీూరాణి కాలేజీ వద్ద నుండి భారీ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డి.కె అరుణమ్మ పాల్గొంటారని వెల్లడించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రవి కుమార్ ఎక్బోటే, శ్యామ్ రావ్, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ మిర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, బీజేవైఎం నాయకుడు గాంజా సాయి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చూడాలి

- ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం
- చదువుకున్న యువత అవగాహన కల్పించాలి: సర్పంచ్ పులగుర్ల కృష్ణారెడ్డి



**కల్వకుర్తి,ఆగస్టు13,(జనంసాక్షి):** ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా గ్రామంలోని విద్యావంతులు, విద్యార్థులు,యువత చొరవ చూపాలని కురుమిద్ద సర్పంచ్ పులగుర్ల కృష్ణారెడ్డి కోరారు. ఈ నెల 25వ తేదీ వరకు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. గ్రామంలో పింఛన్‌కు అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తు విధానం తెలియక కొందరు ప్రయోజనం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి చదువుకున్న వారు, యువత వివరాలు తెలియజేసి, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని సూచించారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తహసిల్దార్‌కు వినతి




**తెలకపల్లి, ఆగస్టు 13(జనంసాక్షి):** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల యూపీఎస్పీ ఇచ్చిన పిలుపు మేరకు దశలవారీ పోరాటంలో భాగంగా గురువారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ కు టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయడంతో పాటు పిఆర్సి కమిటీ నివేదికను బహిర్గతం చేసి, వెంటనే పిఆర్సిని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ నాయకులు చంద్రమౌళి, శ్రీనివాసులు, రమేష్, కొమ్ము రమేష్, ఛత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు శాస్త్రీయ సాగుపై సూచనలు



**చిన్నంబావి, ఆగస్టు 13(జనంసాక్షి):** తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వనపర్తి ఆధ్వర్యంలో చిన్నంబావి మండలంలోని కొప్పునూరు, అయ్యవారిపల్లి, లక్ష్మిపల్లి గ్రామాల్లో గురువారం నిర్ధారణ క్షేత్ర సందర్శన నిర్వహించారు. కార్యక్రమంలో టి ఆర్ వి కె సమన్వయకర్త, శాస్త్రవేత్త ఎన్. నవత, ఏఈఓ సుబహాన్ పాషా, చెరుకు క్షేత్ర అధికారి అఫ్సర్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న, ఉల్లి, చెరకు, కంది పంటలను పరిశీలించారు. పంటల పెరుగుదల, పోషక లోపాలు, కలుపు, చీడపీడల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి రైతులకు తగిన సూచనలు అందించారు. మొక్కజొన్నలో కలుపు నివారణతో పాటు సమతుల్య ఎరువుల వినియోగం, నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కజొన్నలో నిర్వహిస్తున్న ఆన్‌ఫార్మ్ ట్రయల్స్‌ను పరిశీలించారు. నానో యూరియా, నానో డీఏపీతో పాటు కలుపు నివారణ మందుల వినియోగం వల్ల పంట పెరుగుదలపై కలుగుతున్న ప్రభావాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఎరువులు, కలుపు నివారణ మందులను సిఫారసు చేసిన మోతాదులో, పంట దశకు అనుగుణంగా ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు తమ పంటల్లో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురాగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాస్త్రీయ పద్ధతులతో పరిష్కార మార్గాలను సూచించారు. ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పంటల దిగుబడిని పెంచడంతో పాటు సాగు ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు.

## జర్నలిస్టుల హక్కుల పరిరక్షణే టియుడబ్ల్యూజే ధ్యేయం

- జిల్లా అధ్యక్షుడు కాటం నాగరాజు గౌడ్
- నవాబ్‌పేట మండల టియుడబ్ల్యూజే (ఐజేయు)
- నూతన కార్యవర్గం ఎన్నిక




**నవాబ్‌పేట, ఆగస్టు 14(జనంసాక్షి):** దశాబ్దాల కాలంగా నిర్దిష్టమైన ప్రణాళికతో జర్నలిస్టుల హక్కుల కోసం టియుడబ్ల్యూజే (ఐజేయు) రాజీలేని పోరాటం చేస్తోందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షుడు కాటం నాగరాజు గౌడ్ తెలిపారు. నవాబ్‌పేట మండలంలో నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, జర్నలిస్టులకు నూతన మెంబర్‌షిప్‌లు పంపిణీ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, నూతన ప్రతినిధులు విలేకరుల హక్కుల పరిరక్షణకు నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నవాబ్‌పేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆనంద్ (వార్తావేదిక), అధ్యక్షుడిగా రాఘవేంద్ర చారి (ఆంధ్రప్రభ), ఉపాధ్యక్షుడిగా శేఖర్ (వార్త), ప్రధాన కార్యదర్శిగా స్వామి (క్యూ న్యూస్), కోశాధికారిగా సూర్య నాయక్ (వే టు న్యూస్), సంయుక్త కార్యదర్శిగా భాను (బీటీ న్యూస్), జాయింట్ సెక్రెటరీగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా నర్సింలు (ప్రజాతంత్ర), రవి (విజన్ ఆంధ్ర), రాహుల్ (మెట్రో న్యూస్), శంకర్ (గిరిజన సంస్కృతి)లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి జిల్లెల రఘు, నాయకులు సీనియర్ జర్నలిస్ట్ లు రఘునాథ రావు,చంద్రశేఖర్ గౌడ్, చిక్కా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా

- దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ జాతీయ జెండాల ప్రదర్శన
- వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా పాల్గొన్న బీజేపీ శ్రేణులు

**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వికసిత్ భారత్ లక్ష్యంగా మెదక్ జిల్లా కేంద్రంలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో



జరిగిన ఈ కార్యక్రమానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షుడు వెల్మకొండ రాజేందర్, కార్యదర్శి సాధు అశోక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, బట్ల జనార్దన్, పట్లోళ్ల మల్లిక, జ్ఞానేసింగ్, హర్ ఘర్ తిరంగా సహ కన్వీనర్లు రాజేశ్వరి, సాయి సన్నీ, మెదక్ కౌన్సిలర్లు అఖిల, భారత్, పప్పా, రాజమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత: ఎస్సై యం.రమేష్

- వ్యక్తిపై కేసు నమోదు



**తెలకపల్లి, ఆగస్టు 13(జనంసాక్షి):** అక్రమంగా రేషన్ బియ్యం పట్టుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకున్న సంఘటన స్థానిక ఎస్సై యం. రమేష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు అందించిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అలీ ఇంటి వద్ద అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో సివిల్ సప్లైస్ డిపార్ట్‌మెంట్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ ఎ.హేమ్లా నాయక్, పోలీసులు గురువారం ఉదయం 9:45 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటి కాంపౌండ్‌లో తనిఖీ చేయగా 12 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 6 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. అధికారులు పంచనామా నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎ. హేమ్లా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై యం రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## కొత్త గ్రామంలో వివాహిత దారుణ హత్య



**వెల్దండ, ఆగస్టు 13(జనంసాక్షి):** వివాహిత యువతి దారుణ హత్యకు గురైన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొత్త గ్రామంలో చోటుచేసుకుంది.స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త గ్రామానికి చెందిన నారుమళ్ళ అనూష (22) బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.అదే గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తితో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి ఒడ్డోని రాళ్ల వద్దకు తీసుకెళ్లి హత్య చేసి ఆపై నిప్పంటించి దహనం చేశాడు.విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. హత్యకు పాల్పడిన వ్యక్తితో పాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా వెల్దండ సీఐ రఘువీర్ రెడ్డి, కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్ ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## జిపి బిల్డింగ్‌కు భూమి పూజ చేసిన సర్పంచ్



**మల్దకల్, ఆగస్టు 13(జనంసాక్షి):** మండలం పరిధిలోని కుర్తి రావుల చెరువు గ్రామంలో గురువారం నూతన పంచాయతి భవన నిర్మాణానికి సర్పంచ్ భగవంతు భూమి పూజ చేశారు.ఉపసర్పంచ్ దేవమ్మ, జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి మాజీ అధ్యక్షులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రాఘవేంద్ర గౌడ్,పీఏసీఎస్ సింగల్ విండో అధ్యక్షులు శేషంపల్లి తిమ్మారెడ్డి,మాజీ ఎంపీపీ వై రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి,గౌడ సంఘం అధ్యక్షులు భాస్కర్ గౌడ్,మాజీ కోఆప్షన్ నెంబర్ మహబూబ్ అలీ, బుచ్చిరెడ్డి, కృష్ణారెడ్డి,రత్నం,రాముడు గౌడ్,వార్డు మెంబర్లురాఘవేంద్ర రెడ్డి నారాయణ రెడ్డి,రామిరెడ్డి బోయ భాస్కర్,కర్ల,శివారెడ్డి శ్రీనివాస్ రెడ్డి,బుద్దన్న ధనుంజయ్ బసన్ గౌడ్ మాజీ ఉపసర్పంచ్ కోటేశ్వర గౌడ్,విద్యుత్తు కాంట్రాక్టర్ రాఘవేంద్ర గౌడ్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంగాధర్ శెట్టి, ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు అండగా పీఏసీఎస్..

# కోల్డ్‌ప్రెస్ ఆయిల్ మిల్లు, గోదాములు ప్రారంభం

- స్థానిక ఎమ్మెల్యే డా.కూచుకుల్ల రాజేష్ రెడ్డి





**తెలకపల్లి,ఆగస్టు 13 (జనంసాక్షి):** రైతుల సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, సహకార రంగ అభివృద్ధి లక్ష్యంగా తెలకపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యూర్ కోల్డ్‌ప్రెస్ ఆయిల్ మిల్లును స్థానిక ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. గురువారం చిన్నముద్దునూర్, రాకొండ, తాళ్లపల్లి ప్రాంతాల్లో నిర్మించిన మొత్తం 5,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు, అగ్రి ఔట్‌లెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంతో పాటు స్థానికంగా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ పెంచే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కోల్డ్‌ప్రెస్ ఆయిల్ మిల్లు ద్వారా నాణ్యమైన సహజసిద్ధమైన నూనెలను ఉత్పత్తి చేయడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. 5,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములతో రైతులు తమ పంటలను సురక్షితంగా నిల్వ చేసుకుని, మార్కెట్‌లో మంచి ధరలు లభించినప్పుడు విక్రయించుకునే అవకాశం కలుగుతుందని అధికారులు పేర్కొన్నారు. అగ్రి ఔట్‌లెట్ల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్స్ రైతులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం పిఏసిఎస్ చైర్మన్, సీఈఓలు మాట్లాడుతూ రైతు సంక్షేమం, సహకార రంగ అభివృద్ధి, గ్రామీణ ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా మరిన్ని రైతు ప్రయోజన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ రిజిస్ట్రార్ పరిమిళ దేవి, ఆర్ఎం శార్దూల్ జాదవ్, డీసీఓ రఘునాథన్ రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు, ఎన్‌సీడీసీ ఆర్ఎం శ్రీనివాసన్, డీజీఎం రమేష్, ఏడీఏ పూర్ణచందర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ద్యాసాని భాస్కర్ రెడ్డి పీఏసీఎస్ సీఈఓ ధర్మవీర్, ఎఫ్‌పీఓ డొమైన్ ఎక్స్‌పర్ట్ సృజన్, కార్యవర్గ సభ్యులు, రైతులు, సంఘ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా కళాకారుల తీరు

- కొల్చారం ఎంపీడీవో కార్యాలయంలో డ్రగ్స్ పై అవగాహన
- డ్రగ్స్‌కు దూరంగా.. భవిష్యత్తుకు బాటగా
- ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా



**కొల్చారం, ఆగస్టు 13(జనంసాక్షి):** ప్రభుత్వ పథకాలపై గ్రామ గ్రామాన ప్రజలకు వివరిస్తూ అవగాహనా కల్పించాల్సిన కళాకారులు మండల అభివృద్ధి కార్యాలయం దగ్గర అధికారులు విధులు ముగించుకొని వెళ్తున్న సమయంలో బుధవారం సాయంత్రం వారి పాటలతో అవగాహనా కల్పించడం ఏంటని చూపారులందరు విస్మయానికి గురయ్యారు.కాగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ సంస్కృతిక సారధి కల్చరల్ టీం, ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యం, ఏలినో, మానవ సంబంధాల, గంజాయి డ్రగ్స్, పరిసరాల పరిశుభ్రత రోడ్డు భద్రత, వర్షాకాలంలో తీసుకోవల సిన జాగ్రత్తలను పాటించ వలసిన అంశాలపై ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా ఆధ్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించిన కళా బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానా స్పద లింకుల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఓటీపీ, పిన్, సీవీవీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయం, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు, విద్యార్థినుల్లో చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసుల ను సంప్రదించాలని సూచించారు.

అయితే ప్రజలకు అవగాహనా కల్పించాల్సి ఉండగా అధికారుల కార్యాలయం వద్ద వారి ఇష్టానుసారంగా పాటలు పాడితూ మంత్రంగా అవగాహనాను ముగించారు.ఈ కార్యక్రమంలో కొల్చారం ఎంపీడీవో రఫిక్ ఉన్నిసాతో పాటు కళాకారులు టీం లీడర్ కలంజలి రాజేష్, ముదిగొండ నర్సింలు, విరపత్తిని వెంకటేష్, యం భార్గవి, సదిమెల రాజమణి, నీరటి రవీందర్, ఎరుపుల నరసయ్య, ఎల్లయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రూ.20 వేల విలువైన క్రీడా దుస్తులు అందజేసిన అరే రవీందర్

- ఉప సర్పంచ్ సేవలను అభినందించిన గ్రామస్తులు



**కొల్చారం, ఆగస్టు 13 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని తుక్కాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ ఉపసర్పంచ్ ఆరే రవీందర్ ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్ అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు రూ.20 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. వ్యాపార కార్యకలాపాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న రవీందర్ గత సంవత్సరం జనవరి 26న పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. ఈ ఏడాది కూడా విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లు అందించడం పట్ల గ్రామస్తులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డ ఆంజనేయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్, ఉపాధ్యాయురాలు ప్రమీల, వార్డు సభ్యులు గంగయ్య, సుధాకర్, మమత, శ్రీనివాస్‌తో పాటు గ్రామ పెద్దలు అంబాజీరావు, లింగప్పు, మల్లప్పు, సిద్ధప్పు, సిద్దు, మల్లయ్య, టేక్మాల్ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

### హమాలీ కార్మికులకు

## వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి



**చేర్యాల, ఆగస్టు 13(జనంసాక్షి):** ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇతర ప్రభుత్వ,ప్రజా అవసరాల కోసం అనేక రకాలుగా అనేక రంగాలలో పనులు చేస్తున్న హమాలీ కార్మికులకు వర్తించే విధంగా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు అనుబంధ సంఘమైన హమాలి సంఘం చేర్యాల మండల నాయకులు బుచ్చెల్లి నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా చూసుకోవాలని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి 55 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ ప్రమాద బీమా 25లక్షలకు పెంచాలని, ప్రభుత్వ గోదాముల్లో పని చేస్తున్న హమాలి కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి హెల్త్ కార్డులు అందజేసి వైద్య సదుపాయాలతో పాటు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలనీ గురువారం తహసిల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలుగు రవి, ఏదుల ఆంజనేయులు, దేవనబోయిన కిష్టయ్య, కత్తుల నరసింహారెడ్డి, ముస్త్యాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మాజీ మంత్రి రాజు గౌడను మర్యాద పూర్వకంగా కలిసిన శివరాజ్ పాటిల్



**కృష్ణ, ఆగస్టు 13(జనంసాక్షి):** కర్ణాటక మాజీ మంత్రి నరసింహ నాయక్ రాజ్ గౌడ (బీజేపీ)ను కృష్ణ మండల బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు గురుజాల్ శివరాజ్ పాటిల్ సురుపుర్‌లోనీ పార్టీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం తాజా రాజకీయాలు వివిధ అంశాల పట్ల చర్చించారు. అనంతరం ఈ కార్యక్రమంలో సంతోష్, తిమ్మప్ప, వెంకట్ రెడ్డి, మల్లికార్జున్, అశోక్, మ్యాకల్ బిమ్, సురేష్, రవి, సైదప్ప, బుడ్డమోళ్ళ మహేష్, బసన గౌడ్, విరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలు,రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయడం, ఇసుకను స్వాధీనం చేసుకోవడం, నష్టాన్ని అంచనా వేసి రికవరీ చర్యలు చేపట్టడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు, ఇందుకు సంబంధించి తహశీల్దార్లు ప్రతిమండలనుండి 10 నుండి 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఆ జాబితాను వెంటనే పంపాలని అన్నారు.

అనంతరం జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష నిర్వహించారు. టూ-బీహెచ్‌కే గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి, పెండింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్-1 జాబితాలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారి వివరాలను హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపించాలని సూచించారు. ప్రజాపాలన పోర్టల్‌లోని దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుని అర్హులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు. గృహాల కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు, వర్గాల వారీ రిజర్వేషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

పెండింగ్‌లో ఉన్న గృహాల ఎంపిక ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సంబంధిత హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పరిష్కరించి, గృహాల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

భూభారతి, సాదాబైనమా, రీసర్వే, నక్షా సర్వే, మీసేవ, కుటుంబ రిజిస్ట్రేషన్ల పై తదితర రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ప్రతి పనిలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. భూభారతి పోర్టల్‌లో 60 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లకు ఆదేశించారు. సర్వేయర్ల కొరత, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైన వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.సర్వే సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ల్యాండ్ యాప్‌లోని జీపీఎస్ కోఆర్డినేట్ల ఆధారంగా స్కెచ్‌లు సిద్ధం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పెండింగ్ ఫైళ్లపై నిరంతరం ఫాలోఅప్ చేయడంతో పాటు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలతో పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పనులు కొనసాగుతున్నప్పటికీ భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు.

సాదాబైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన కేసులను లిఖితపూర్వకంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, ప్రతి మండలంలో పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

జిల్లాలో చేపడుతున్న గ్రామాల రీసర్వే పనులను వేగవంతం చేస్తూ గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.,కుటుంబ రిజిస్ట్రేషన్లకు సంబంధించి దరఖాస్తులను కూడా వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఐతే చనిపోయిన వారి వివరణను జాగ్రత్తగా పరిశీలించి కుటుంబ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను జారీ చేయాలని అన్నారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, డి. ఆర్.ఓ ఎ.నిర్మల, ఆర్. డి.ఓ నవీన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి అశోక్, జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, మండల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

### కొల్చారం కస్తూర్బాలో

## ఘనంగా బోనాల సంబరం

- బోనమెత్తిన బాలికలు... అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- భావితరాలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిచయం: ప్రిన్సిపాల్ ధరణి




**కొల్చారం, ఆగస్టు 13 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను కొల్చారం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆధునిక కాలంలో కనుమరుగవుతున్న పండుగలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ధరణి తెలిపారు.

### మాతా శిశు అభివృద్ధి శాఖ

## ఆధ్వర్యంలో... ఘనంగా హర్ ఘర్ తిరంగా



**నారాయణపేట, ఆగస్టు 13(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా మన దేశా నికి గర్వకారణమని, దేశం కోసం తమ వంతు ఉత్తమ సేవలు అందించేందుకు ఇది నిరంతరం స్ఫూర్తిని స్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని, 'వికసిత్ భారత్' నిర్మాణంలో మన మందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహానీ యుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారి ఆశయ సాధ నకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. జాతీ య జెండాతో దిగిన సెల్ఫీలను హర్ గర్ తిరంగా అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ యాదమ్మ, మేరా యువ భారత్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ అనిల్ గౌడ్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త నర్సిములు, జెండర్ స్పెసిలిస్టులు అనిత, నర్సిములు, అధ్యాపక బృందం,నాన్-టీచింగ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా గొంతుకగా.. సభ దృష్టికి

**పాపన్నపేట, ఆగస్టు13(జనంసాక్షి):**
పల్లెల్లో సమస్యలను ప్రజా గొంతుకగా సభ దృష్టికి తీసుకువచ్చారు. గురువారం గ్రామాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్పీఓ యాదయ్య,ఎంపీడీవో విష్ణువర్ధన్ సమక్షంలో వాడీ వేడిగా జరిగింది. విద్యుత్తు శాఖ ఏఈ,లైన్మెన్ లు గ్రామంలో సమస్య ఉందని ఫోన్ చేస్తే స్పందించడం లేదని సర్పంచులు ఆగ్రహించారు. కుర్తివాడ గ్రామంలో పలు వార్డులకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని గ్రామ సర్పంచ్ శ్రీధర్ వాపోయారు. పాపన్నపేట,రామతీర్థం గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రతరంగా ఉందని,నూతన ట్యాంకులు నిర్మించి పైపులైను వేసి సమస్య పరిష్కరించాలని సర్పంచులు పావని నరేందర్ గౌడ్,సాయి రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో 699 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 173 ఇండ్లు పూర్తయ్యాయని,మిగతావి వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఏడుపాయల కమాన్ వద్ద,యూసఫ్ పేట,కొత్తపల్లి బ్రిడ్జ్,ఎల్లాపూర్ బ్రిడ్జి వద్ద వర్షం కురిస్తే రహదారిపై ప్రయాణించలేని పరిస్థితి ఉందని సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకుపోగా సమస్య పరిష్కరించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆర్అండ్‌బీ అధికారి వెల్లడించారు. దౌలాపూర్ గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పలు రైతులకు భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు లేకపోవడంతో యూరియాకు నానా పాట్లు



పడుతున్నారాని సర్పంచ్ ఆర్. అంజయ్య అన్నారు. అట్టి భూములకు సంబంధించి కోర్టు కేసులు ఉండడంతో సమస్య ఉందని అధికారి వెల్లడించారు. మండలంలో మొత్తం 26,456 ఎకరాలు సాగులో ఉండగా అందులో 26,212 ఎకరాల్లో వరి సాగు చేశారని,మిగతా వాటిలో పత్తి,కంది, పెసరు,చెరుకు,కూరగాయలు పండిస్తున్నారని ఏవో శ్రీనివాస రాజు పేర్కొన్నారు. ఏడుపాయల కమాన్ నుంచి దేవస్థాన ప్రాంగణం వరకు సుమారు 7 కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, మండలంలోని పలు గ్రామాలకు సైతం రహదారి నిర్మాణాలకు నిధులు కేటాయించబడిం దని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు. హమ్ గ్రాండ్ కింద సైతం పలు గ్రామాల్లో రహదారులు నిర్మించనున్నామని పేర్కొన్నారు. గ్రామంలో చాలా మందికి జాబ్ కార్డులు లేవని సర్పంచులు ఇంచార్జి ఏపిఓ యాదగిరి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ అధికారుల జాడ లేదు. తహశీల్దార్ సతీష్ కుమార్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు నీరుడి వెంకటేశం,సర్పంచులు శ్రీనివాస్,రాణెమ్మ రమేష్,పంకజ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తానా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డాక్టర్ సముద్రాల శ్రీనివాస్

- వైద్య రంగ అభివృద్ధికి కృషి



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి):**
తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గురువారం సిద్దిపేట పట్టణంలో సిద్దిపేట ఐఎంఏ, తానా అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సముద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య రంగ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రత్యేక కృషి చేస్తానన్నారు.తల్లిదండ్రులు జన్మనిస్తే పునర్జన్మ నిచ్చేది వైద్యులే అని అన్నారు. నిరంతరం ప్రజల ఆరోగ్యం గురించి పనిచేసే వైద్యులపై దాడులు చేయడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ వైద్యులకు, సిబ్బందికి సహకరించాలన్నారు.

ఇటీవల వరంగల్లో జరిగిన తానా రాష్ట్ర సదస్సులో తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్న ప్రతి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఐఎంఏ, తానా ప్రతినిధులు రామ్మోహన్, భీమేష్, ఫణిందర్ రెడ్డి, రవికాంత్,ప్రణీత్,గణేష్, పెద్ది రాజు, నరేందర్, వీరన్న ,గణేష్, వేణు లు ఉన్నారు.

# పటాన్‌చెరు జర్నలిస్టుల ఐక్యతకు ప్రశంసలు

- **త్వరలో రాష్ట్రస్థాయి సమావేశం: విరహత్ అలీ**



**రామచంద్రపురం, ఆగస్టు 13(జనంసాక్షి):** పటాన్‌చెరు జర్నలిస్టుల ఐక్యత రాష్ట్రవ్యాప్తంగా ప్రశం సలు అందుకుంటోందని టీయూడ బ్ల్యూజే- ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు కే.విరహత్ అలీ అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం గురువారం బషీర్ బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించింది.

ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన జర్నలిస్టుల సమావేశం విజయవంతమై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని విరహత్ అలీ ప్రశంసించారు. సంఘానికి 75 ఏళ్ల ఘన చరిత్ర ఉందని, పదవులు అధికారం కాదని.. బాధ్యత అని పేర్కొన్నారు. జర్న లిస్టులు క్రమశిక్షణతో, సేవాభావంతో పనిచేయాలని సూచించారు.

త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశాన్ని భారీ గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరుకు ప్రత్యేక గుర్తింపు ఉందని, దాన్ని మరింత పెంచేలా నూతన కార్యవర్గం పనిచేయాలని కోరారు. జర్న లిస్టుల హక్కుల సాధనకు ఐక్యంగా కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, పటాన్‌చెరు అధ్యక్షుడు పత్తి నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, చెన్న బసవేశ్వర్, శ్రీనాథ్, శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఈశ్వర్‌చౌహాన్, శివ కుమార్, సిద్దు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# శోకాన్ని మరిపించేల... సుందరీ కరణగ శ్రీరామ కుంట స్మశాన వాటిక..

- **మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**
- **బయోగ్యాస్ ద్వారా దహన సంస్కారాలు... ప్రారంబానికి సిద్ధం చేయాలి...**





**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి):** సిద్దిపేట పట్టణంలో మోడల్ గా తీర్చిదిద్దిన శ్రీరామ కుంట స్మశాన వాటిక మరింత సుందరీ కరణ చేపడుతున్న నేపథ్యంలో పనులను మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పరిశీలించారు.. జరిగిన పనుల పై సంతృప్తి వ్యక్తం చేస్తూ పెండింగ్ పనులు పై పలు సూచనలు చేసారు... ఆత్మ ఆనంద పడేలా, శోకాన్ని మరి పించే విధంగా సుందరీకరణ, నందన వనంగా చేసు కుంటున్నామని చెప్పారు.. వైకుంఠ దామం అంటే ఒక పార్క్ మాదిరిగా చేసుకున్నామని మరింత సుందరీకరణ గా తీరదిద్దేందుకు పనులు చేపడుతున్నట్లు చెప్పారు.. వైకుంఠ దామం క్షేత్ర స్థాయి లో పరిశీలించారు.. మరికొన్ని మొక్కలు నాటలని, సిసి రోడ్డు వేయాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలనీ చెప్పారు... రాత్రి సమయాల్లో లైటింగ్ లేక దహన సంస్కారలకు ఇబ్బంది అవుతుందని వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. టాయిలెట్స్ మరమ్మత్తులు చెప్పట్టాలని చెప్పారు. బయోగ్యాస్ ద్వారా దహన సంస్కా రాలు జరిగేవిధంగా పనులు త్వరతగతిన పూర్తి చేసి ప్రారం భించాలని చెప్పారు.

# హెచ్ఐవికి పూర్తిస్థాయి నివారణ మందు లేదు... జాగ్రత్తలే ముఖ్యం

- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గనేశ్వర్**




**మెదక్, ఆగష్టు 23(జనంసాక్షి):** స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గణేశ్వర్ మాట్లాడుతూ, హెచ్ఐవీకి ప్రస్తుతం పూర్తిస్థాయి నివారణ మందు లేదని, వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యమని తెలిపారు. యువత హెచ్ఐవీతో పాటు లైంగికంగా సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని, అపోహలకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నెల 12వ తేదీ నుంచి రెండు నెలల పాటు జిల్లాలో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాలు, యువజన కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. మెదక్ జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, స్కోప్ ఎన్జీవో, లింక్ వర్కర్ ప్రాజెక్ట్, ఐసీటీసీ కౌన్సిలర్లు, డీఎస్ఆర్సీ కౌన్సిలర్లు, హెచ్ఐవీ విభాగానికి సంబంధించిన సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలను విజయ వంతం చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీపై అవగాహన కల్పించే పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వ్యక్తి హెచ్ఐవీకి సంబంధించి అధిక ప్రమాదం (హై రిస్క్) లేదా తక్కువ ప్రమాదం (లో రిస్క్) వర్గంలో ఉన్నారా అనే విషయాన్ని తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు అందుబాటులో ఉంటాయి. ప్రశ్నలకు సమాధానాల ఆధారంగా హెచ్ఐవీ పరీక్ష అవసరమైతే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలని సూచనలు అందుతాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ హరికృష్ణ, స్థానిక హై స్కూల్ హెడ్మాస్టర్ మల్లేశం గారు ఐసీటీసీ కౌన్సిలర్లు గోపి, సుధాకర్, రవి, లైంగిక వ్యాధుల కౌన్సిలర్ రాజేశ్వర్, స్కోప్ ఎన్జీవో ప్రతినిధి ఉప్పలయ్య, లింక్ వర్కర్ ప్రోగ్రాం ప్రతినిధులు లక్ష్మణ్, అనిల్, ఔట్రీచ్ వర్కర్లు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. యువతలో హెచ్ఐవీపై అవగాహన పెంచి, అపోహలను తొలగించి, సకాలంలో పరీక్షలు మరియు అవసరమైన వైద్య సేవలు పొందేలా చేయడమే ఈ అవగాహన కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.

# ప్రాణాపాయ స్థితిలో వచ్చిన బాబుకు.. ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావు



**రామాయంపేట, ఆగస్టు 13 (జనంసాక్షి):** ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి తీసుకొచ్చిన నవజాత శిశువుకు వైద్యులు అందించిన చికిత్సతో కోలుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్న శంకరంపేట మండలం కామారం గ్రామానికి చెందిన పాట్లూరి శోభ-చంటి దంపతులకు ఈ నెల 5న మెదక్‌లోని ఓ ఆస్పత్రిలో బాబు జన్మించాడు. రెండు రోజుల అనంతరం బాబు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెదక్ వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే బాబు తల్లిదండ్రులు హైద రాబాద్‌కు తీసుకెళ్లకుండా రామాయంపేట పట్టణంలోని రాజరాజేశ్వరి పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ నెల 7న డాక్టర్ ప్రదీప్ రావు నేతృత్వంలో వైద్యులు చికిత్స ప్రారం భించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాబు కు వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించ డంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. గురువారం బాబు పూర్తిగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసి ఇంటికి పంపిం చారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బాబును రాజరాజేశ్వరి పిల్లల ఆస్పత్రికి తీసుకురాగా, డాక్టర్ ప్రదీప్ రావు అందిం చిన వైద్యం, సిబ్బంది సహకారంతో బాబు కోలుకున్నాడని ఆనందం వ్యక్తం చేశారు. తమ బాబుకు ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావుతో పాటు ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞత లు తెలిపారు.

# చోరీలపై జాగ్రత్తగా ఉండాలి: ఎస్ఐ మధుకర్ రెడ్డి



**శివ్వంపేట, ఆగస్ట్13(జనంసాక్షి):** మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో రాత్రి వేళల్లో దేవాలయాలలో చోరీలు జరగడం, హుండీలను ఎత్తుకెళ్లడం వంటి నేరాలు వెలుగులోకి వచ్చాయని, ఈ విషయమై పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణించి ఇప్పటికే నిఘా పెంచడం జరిగిందని శివ్వంపేట ఎస్ఐ మధుకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని దేవాలయాల భద్రత దృష్ట్యా గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు, యువకులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఆలయం వద్ద విధిగా నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా కెమెరా రికార్డింగ్ డీవీర్ ను సురక్షితమైన ప్రదేశంలో ఉంచాలని, హుండీలను నేలమీద లేదా గోడకు దృఢంగా, కాంక్రీట్ తో బిగించాలనీ సూచించారు. సాధ్యమైనంత వరకు హుండీలలోని డబ్బును ఎప్పటికప్పుడు తీసి బ్యాంకు ఖాతాలో జమ చేసుకోవాలని, రాత్రి వేళల్లో కాపలాగా గ్రామ యువకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు రాత్రి వేళల్లో వంతులవారీగా ఆలయాల వద్ద కాపలా ఉండాలని ఎస్ ఐ విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణంలో, హుండీలు ఉన్న ప్రదేశాల్లో తగినంత కరెంటు లైటింగ్ ఉండేలా చూడాలి. అలాగే విలువైన వస్తువుల భద్రత కోసం రాత్రి వేళల్లో ఆలయంలో ఉండే ప్రధాన ఆభరణాలను ఆలయంలో కాకుండా సురక్షిత లాకర్ల లల్లో ఉంచాలని ఎస్ఐ మధుకర్ రెడ్డి కోరారు.

# శ్రీరంగాపూర్‌లో టి ఎస్ సి పి ఎస్ ఇ యు 'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

- **ఆగస్టు 23న లక్షలాది మందితో చలో హైదరాబాద్ : జిల్లా అధ్యక్షులు మద్దిలేటి**




**శ్రీరంగాపూర్, ఆగస్టు 13(జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓ పి ఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టి ఎస్ సి పి ఎస్ ఇ యు, ఆధ్వర్యంలో బిఆగస్టు 23న చేపట్టబోయే 'చలో హైదరాబాద్'బి కార్యక్రమ పోస్టర్నుఆవిష్కరించారు. వనపర్తి జిల్లా టి ఎస్ సి పి ఎస్ ఈ యు, అధ్యక్షులు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి రాజేందర్ ,రాష్ట్ర బాధ్యులు మోహన్ బాబు ఆధ్వర్యంలో జూనియర్ కాలేజ్, ఎంపీడీవో కార్యాలయం మరియు తహశీల్దార్ కార్యాలయాల వద్ద పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగాపూర్ మండల తహశీల్దార్ వరలక్ష్మి,ఎంపీఓ రాజు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మోజెస్, జడ్.పి.హెచ్. ఎస్ ప్రధానోపాధ్యాయు రాలు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

**మేనిఫెస్టోలో చెప్పినట్లు తక్షణమే సిపిఎస్ రద్దు చేయాలి: మద్దిలేటి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలో అధికారం లోకి వచ్చిన ఆరు నెలల్ల సిపి ఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే లక్షలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులతో ఆగస్టు 23న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 2.6 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానం పెనుభూతంలా మారిందని అన్నారు. స్టాక్ మార్కెట్ తో ముడిపడిన పెన్షన్ విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలిత ఐదు రాష్ట్రాల్లో ఓ పి ఎస్ ఎస్ పూనరుద్ధరించారని, తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే ఓ పి ఎస్ అమలు చేసి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు- టి ఎస్ మండల అధ్యక్షులు వసంతపురం రాజు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి రాజు నాయక్ టిపిఎఎస్ మండల అధ్యక్షులు ఈశ్వరయ్య, పి ఆర్ టి యు టి ఎస్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ నాయుడు, టిపీఎస్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జూనియర్ లెక్చరర్లు, ఎంపీ ఓ తహశీల్దార్ కార్యాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్పునూర్‌లో ప్రాథమిక సహకార సంఘం (పిఏసీఎస్) నూతన భవనం ప్రారంభం

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**రేవల్లి, ఆగస్టు 13(జనంసాక్షి):** రేవల్లి మండలంలోని తల్పునూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) భవనాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు, సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నూతన భవనం ద్వారా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, పంట కొనుగోళ్ల వంటి సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతుల ఆర్థిక అభ్యున్నతికి పీఏసీఎస్ లు వెన్నెముక వంటివని, వాటిని ఆధునీకరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నూతన భవనం ప్రారంభంతో రైతులకు మరింత సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, సహకార శాఖ అధికారులు, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూలే విగ్రహావిష్కరణలో భాగస్వాములు కావాలి: సరిత



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జనంసాక్షి):** ఈ నెల 14వ తేదీన హైదరాబాదులోని హెచ్.ఎం.డి.ఏ గ్రౌండ్స్ ఎదురుగా మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా టి.జి.ఎస్.జి.డి.సి.ఎఫ్.ఎల్ చైర్పర్సన్ సరిత గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా నుంచి వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.పూలే దంపతుల బాటలో ప్రజా సంక్షేమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని సరిత అన్నారు. విద్య, సామాజిక సమానత్వం కోసం పూలే దంపతులు చేసిన కృషి యావత్ సమాజానికి ఆదర్శమని కొనియాడారు.రాష్ట్రంలోని బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ చారిత్రక కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని, ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## గుడ్డపల్లి రైతు వేదికలో చెరకు పంట యాజమాన్యం, నానో ఎరువులపై అవగాహన కార్యక్రమం



**మొగుడంపల్లి, ఆగస్టు 13(జనంసాక్షి):** మండల పరిధిలోని గుడ్డపల్లి రైతు వేదికలో గురువారం చెరకు పంట యాజమాన్యం, నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్ పూర్ శాస్త్రవేత్త శ్రీమతి విజయలక్ష్మి పాల్గొని చెరకు పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.చెరకు సాగులో ఎరువుల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణ, పురుగుమందుల వినియోగం తదితర శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులను ఆమె వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ ) శ్రీ బి. భిక్షపతి నానో ఎరువుల వినియోగం, వాటి ప్రయోజనాలు, సరైన వినియోగ పద్ధతులను వివరించారు. అలాగే కంది పంటలో ఎండు తెగులు నివారణ, యాజమాన్య పద్ధతులతో పాటు ఇతర పంటల్లో చేపట్టాల్సిన చర్యలను వివరించారు.మొగుడంపల్లి మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ వో ) శ్రీ ఎం.డి. హస్నుద్దీన్ ఎరువుల బుకింగ్ యాప్ వినియోగ విధానం, వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, రైతులకు అందుబాటులో ఉన్న సేవలను వివరించారు.వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇవో ) శ్రీ కె. ప్రదీప్ కుమార్ నేల పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. నేలలోని పోషక స్థితిని తెలుసుకుని, నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులను వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పంట దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా రైతులకు శాస్త్రీయ పంట యాజమాన్యం, సమతుల్య పోషక యాజమాన్యం, నానో ఎరువుల వినియోగం, నేల ఆరోగ్యం, తెగుళ్ల యాజమాన్యం, వ్యవసాయ శాఖ సేవలపై అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారులు సూచించారు.కార్యక్రమంలో గుడ్డపల్లి గ్రామ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, గౌసాబాద్ సర్పంచ్ నందు, గౌసాబాద్ తండా సర్పంచ్ నారాయణ, ఔరంగ్ నగర్ ఉప సర్పంచ్ శేఖర్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, ఖలీజ్, ఆత్మ బీటీఎం చరణ్, రైతులు గోవర్ధన్ రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, సిద్ధా రెడ్డి, రాజేందర్ రెడ్డి, సాయి చరణ్, భాస్కర్, మారుతి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో రూ.48 కోట్లతో ఆధునిక ప్రభుత్వ పాఠశాల

- ఆగస్టు 17న భూమిపూజ.. కేజీ నుంచి ఇంటర్ వరకు విద్యాబోధన
- పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**రామచంద్రాపురం, ఆగస్టు 13(జనంసాక్షి):** పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో తెల్లాపూర్‌లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మించనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం తెల్లాపూర్‌లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక పాఠశాల నిర్మించనున్న స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.

ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు తెలిపారు. డిజిటల్ తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, విశాలమైన క్రీడా మైదానంతోపాటు ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు.

పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్ లో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆగస్టు 17న భూమిపూజ...**

నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి ఆగస్టు 17న భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో పటాన్ చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# కౌడిపల్లి రైతు వేదికలో సాధారణ సర్వసభ్య సమావేశం

- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా
- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి




**కౌడిపల్లి, ఆగస్టు13 (జనంసాక్షి):** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి రైతు వేదికలో గురువారం డిఎల్‌పిఓ సురేష్ బాబు, ఆధ్వర్యంలో నిర్వహించిన సాధారణ సర్వ సభ్య సమావేశానికి,నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సర్పంచులు అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు, లూజ్ వైరింగ్, వోల్టేజీ హెచ్చుతగ్గులపై అధికారులను ప్రశ్నించారు.

రైతులు ఎరువుల కోసం ఫర్టిలైజర్ యాప్‌ల ద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కొనుగోలును సులభతరం చేయాలని, పాత విధానంలోనే షాపుల ద్వారా ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని అన్నారు. సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వచ్చే సమావేశం వరకు పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని, గైర్హాజరయ్యే శాఖల అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. అవసరమైతే మెమోలు జారీ చేయాలని ఆదేశించారు.

ఫర్టిలైజర్ యాప్‌ల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. చదువుకోని రైతులు యాప్‌లను ఎలా నిర్వహించగలరని ప్రశ్నిస్తూ, ఎరువుల కోసం రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని అన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా యూఎల్‌సీసీ కార్యక్రమాన్ని రిజిస్టర్ చేసుకోవాలని సర్పంచులకు సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడి లేకుండా జలసిరి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మండలంలో కొత్తగా బీటీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ కార్యాలయాలు నిర్మాణ దశలో ఉన్నాయని, అవసరమైన చోట కొత్త భవనాల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సమావేశం అనంతరం తొలిసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డిని సర్పంచులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ, పీఆర్ డిప్యూటీ ఈఈ అమరేశ్వర్, హౌసింగ్ డీఈ మాణిక్యం, ఏవో స్వప్న జాదవ్,తో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవనికి పకడ్బందీగా ఏర్పాట్లు: మెదక్ ఆర్‌డిఓ రమాదేవి



**మెదక్ బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి):** ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మెదక్ ఆర్ డి ఓ రమాదేవి అన్నారు. గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్న ఏర్పాట్లను ఆర్డీవో పరిశీలించారు.

వేడుకలు నిర్వహించనున్న ప్రదేశాన్ని సందర్శించి వేదిక, పరేడ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆర్డీవో సూచించారు.

వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ నవీన్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు సంబంధిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేట

- బాల్య వివాహాల నివారణలో మత పెద్దల పాత్ర కీలకం
- సమాచారం అందిస్తే తక్షణ చర్యలు
- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు13(జనంసాక్షి):** నారాయణపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలు పునిచ్చారు. శ్రావణ మాసం లో వివాహ ముహూర్తాలు ప్రారంభం కానున్న నేపథ్యం లో గురువారం మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని పూజారులు, పాస్టర్లు, ఖ్వాజీలకు బాల్య వివాహాల నిర్మూలనపై ఇక్కడి సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపు ణ్య అభివృద్ధి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహం ఒక సామాజిక రుగ్మత మాత్రమే కాకుండా చట్టవిరుద్ధమైన చర్య అని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండని బాలికకు వివాహం చేయ డం వల్ల ఆమె విద్య, ఆరో గ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడు తుందని తెలిపారు. మత పెద్దల పాత్ర కీలకం

పూజారులు, మౌలానాలు, పాస్టర్లు, ఖాజీలు వివాహ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని, సమాజంలో వారి మాటకు ఎంతో గౌర వం, విశ్వాసం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. బాల్య వివాహం నిర్వహించేందుకు ఎవరైనా సంప్రదించిన ప్పుడు, వివాహానికి అను మతి ఇవ్వకుండా "ఇది సరైన వయసు కాదు..వివాహాన్ని వాయిదా వేయండి" అని స్పష్టంగా చెప్పాలని కోరారు. తమ పరిధిలో బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందిం చాలని మత పెద్దలకు సూచించారు. చట్టంపై విస్తృ త అవగాహనజిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే సర్పంచు లు, చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, ఆర్డీఓలు, తహ సీల్దార్లు, పంచాయతీ కార్య దర్శులకు అవగాహన, శిక్ష ణ కార్యక్రమాలు నిర్వహిం చినట్లు కలెక్టర్ తెలిపారు.

మక్తల్, కొడంగల్, కోస్గి తది తర ప్రాంతాల్లో కూడా బాల్య వివాహాల నివార ణపై మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు.

కారణాలు చూపడం సమ ర్థనీయం కాదుకుటుంబ ఒత్తిడి, ప్రేమ వ్యవహారం, సామాజిక పరిస్థితులు తదితర కారణాలను బాల్య వివాహాలకు చూపుతు న్నప్పటికీ, ఏ కారణంకూడా చట్టాన్ని ఉల్లంఘించడానికి సమర్థన కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. బాల్య వివా హాల వల్ల బాలికలు చిన్న వయసులోనే గర్భధారణ, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవ కాశం ఉందన్నారు. చదువు మధ్యలోనే ఆగిపోయి భవి ష్యత్తులో విద్య, ఉపాధి అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఇటీవల కోటకొం డ పీహెచ్‌సీ సందర్శన సందర్భంగా కవలలకు గర్భవతిగా ఉన్న యువ తిని గుర్తించి, తీవ్ర రక్తహీన తతో బాధపడుతున్న ఆమెకు వెంటనే వైద్య సేవలు అందించి మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించిన విషయాన్ని కలెక్టర్ ప్రస్తావించారు. బాలికలకు చిన్న వయసు లో వివాహం చేయడం వల్ల వారి విద్య, ఉపాధి, ఆరో గ్యం, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై ప్రతికూల ప్రభా వం పడుతుందని కలెక్టర్ అన్నారు. "ఒక బాలికకు బాల్యం కావాలి.. చదువు కావాలి.. ఆరోగ్యం కావాలి..తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం కావాలి" అని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరిక ట్టడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. సమాచారం అందిస్తే తక్షణ చర్యలుజిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతు న్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత తహసీల్దార్, సీడీపీఓ లేదా చైల్డ్ మ్యారేజ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. వయస్సు ధృవీకరణ పత్రా లు, ఆధార్ తదితర వివరా లపై అనుమానాలు ఉన్న ప్పుడు వెంటనే అధికారుల ను సంప్రదించాలని తెలి పారు. బాల్య వివాహాల విషయంలో ఎవరైనా ఒత్తిడి తీసుకువచ్చినా, ఎలాంటి రాజకీయ లేదా ఇతర జోక్యాలకు తలొగ్గ కుండా చట్ట ప్రకారం చర్య లు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రావణ మాసంలో జిల్లాలో జరిగే వివాహాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సీడీపీఓల ద్వారా వివాహాలకు సంబం ధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి, అనుమానాస్పద సందర్భా ల్లో తక్షణమే పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.

రాబోయే రోజుల్లో జిల్లాలో ని అన్ని ప్రాంతాల ప్రతిని ధులతో మరోసారి సమా వేశం నిర్వహించి బాల్య వివాహాల నివారణకు తీసు కుంటున్న చర్యలను సమీ క్షించనున్నట్లు తెలిపారు.

"బాల్య వివాహాలకు స్వస్తి – బాలికల భవిష్యత్తుకు భరోసా – బాల్య వివాహ రహిత నారాయణపేట జిల్లా" అనే లక్ష్యంతో అంద రూ కలిసికట్టుగా పనిచే యాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

**బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు సహకరించాలి...**

నారాయణపేట జిల్లాలో బాల్య వివాహాల నిర్మూల నకు పూజారులు, పురోహి తులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలు, తల్లిదండ్రు లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కోరారు.

వివాహం ఒక పవిత్రమైన కార్యక్రమమని, అయితే బాల్య వివాహం మాత్రం చట్టవిరుద్ధమైనదని స్పష్టం చేశారు. కాలానుగుణంగా సమాజంలో మార్పులు వస్తున్నాయని, ప్రస్తుతం బాలల హక్కులు, విద్య, ఆరోగ్యం, భద్రతకు అత్యం త ప్రాధాన్యత ఇస్తున్నా మని తెలిపారు. బాల్య వివాహాల కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోవడంతో పాటు రక్తహీనత, చిన్న వయ సులో గర్భధారణ, ప్రసవ సమయంలో సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు.

ఒక బాలికకు 18 సంవత్స రాలు పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు ఆమెకు సంర క్షకులుగా ఉండి, చదువు, ఆరోగ్యం, భద్రత, భవిష్య త్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. వివాహ ముహూర్తం నిర్ణయించే సమయంలో జాతకం, గుణమేళనం వంటి అంశా లను ఏ విధంగా పరిశీలి స్తారో, అదే విధంగా వధూవ రుల వయస్సును కూడా అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని పూజారు లు, పురోహితులు, మత పెద్దలను ఎస్పీ కోరారు.

18 సంవత్సరాలు పూర్తికా ని బాలిక వివాహానికి అంగీ కరించకూడదని, వయస్సు పై అనుమానం ఉంటే వివాహాన్ని నిర్వహించకుం డా సంబంధిత అధికారుల కు సమాచారం అందించాల ని సూచించారు. ఆధార్ లేదా ఇతర ధృవపత్రాల్లో అనుమానాస్పద వివరాలు ఉన్నా, తప్పుడు ధృవప త్రాలు సమర్పించినా వాటి ని ఆధారంగా చేసుకుని వివాహం నిర్వహించకుండా పోలీస్ అధికారులు, సీడీ పీఓలకు సమాచారం ఇవ్వా లని తెలిపారు. బాల్య వివా హాన్ని నిర్వహించే వ్యక్తులు కూడా చట్టపరమైన చర్యల కు బాధ్యులవుతారని, బాల్య వివాహ నిషేధ చట్టంలోని నిబంధనలను ప్రతి పూజారి, పురోహితు డు, ఖాజీ, పాస్టర్, మత పెద్ద తప్పనిసరిగా తెలుసు కోవాలని సూచించారు.

తల్లిదండ్రులు, బంధువులు లేదా ఇతరుల నుంచిబాల్య వివాహం నిర్వహించాలనే ఒత్తిడి వచ్చినప్పుడు, "18 సంవత్సరాలు పూర్తికాకుం డా వివాహం నిర్వహించ డం చట్టవిరుద్ధం" అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేసి, చట్టాన్ని రక్షణగాఉపయోగించుకోవాలని సూచించారు. సమా జంలో పూజారులు, పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, మత పెద్దలకు ప్రజల్లో ప్రత్యేకమైన గౌర వం, విశ్వాసం ఉందని, వారి మాటలను ప్రజలు శ్రద్ధగా వింటారని ఎస్పీ తెలిపారు. అందువల్ల వివాహానికి వచ్చే తల్లి దండ్రులకు బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రాధాన్యతను వివరించి, బాల్య వివాహాల నిరోధంలో వారు ముందుండాలని కోరారు. శీఘ్రమే పుత్రప్రాప్తి రస్తు" అనే దీవెనతో పాటు "విద్యా ప్రాప్తిరస్తు, ఉద్యోగ ప్రాప్తిరస్తు" అని ఆశీర్వదిం చాలని ఎస్పీ సూచించారు. బాలికలకు కేవలం వివాహ మే జీవిత లక్ష్యంగా కాకుం డా విద్య, ఉద్యోగం, స్వయం సమృద్ధి, మంచి భవిష్యత్తు లక్ష్యాలుగా ఉండేలా సమాజం ప్రోత్స హించాలన్నారు. బాల్య వివాహం జరుగుతోందని తెలిసిన వెంటనే సంబంధి త అధికారులకు సమాచా రం అందించాలని సూచిం చారు. వయస్సుపై అనుమానం ఉన్న సందర్భాల్లో స్వయంగా నిర్ణయం తీసుకోకుండా పోలీస్ శాఖ, సీడీపీఓ లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి నారాయణ పేట జిల్లాను బాల్య వివా హ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం" అని ఎస్పీ పిలుపునిచ్చారు. "బాలికకు మంచి విద్య అందాలి.. మంచి ఉద్యోగం రావాలి.. తన కాళ్లపై తాను నిలబ డాలి.. అదే మనందరి ఆశీర్వాదం కావాలి" అని పేర్కొన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కు అవగాహన కల్పిస్తూ ముద్రించిన బ్రోచర్లను ఎస్పీతో కలసి కలెక్టర్ ఆవిష్క రించారు. ఈ కార్యక్రమం లో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీపీఆర్ఓ రషీద్, డీసీపీఓ కరిష్మా, చైల్డ్‌లైన్ తిరుపతయ్య, సీడీపీఓలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

## మొబైల్ లింకులు, OTP ల పట్ల అప్రమత్తంగా ఉండాలి - SI నరేందర్ రెడ్డి





**బాలానగర్, ఆగస్టు 13 (జనంసాక్షి):** ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ SI నరేందర్ రెడ్డి అన్నారు.

గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో, కార్యాలయ సమావేశ మందిరంలో వ్యాపారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కార్మికులు మరియు స్థానిక ప్రజలకు "సైబర్ నేరాలపై అవగాహన" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా SI నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. మొబైల్ కు వచ్చే తెలియని లింకులు, SMS లు, WhatsApp మెసేజ్ లను క్లిక్ చేయవద్దని సూచించారు. బ్యాంక్ అధికారులం అని చెప్పి ఫోన్ చేసి OTP, CVV నెంబర్, పాస్వర్డ్ అడిగే వారి మాటలు నమ్మవద్దని హెచ్చరించారు.

**ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు:**

1. తెలియని నెంబర్ల నుండి వచ్చే కాల్స్ కు స్పందించవద్దు
2. బహుమతులు, లోన్ ఆఫర్లు అంటూ వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దు
3. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు షేర్ చేయవద్దు
4. ఆన్లైన్ లావాదేవీల సమయంలో జాగ్రత్తగా ఉండాలి

ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే భయపడకుండా వెంటనే జాతీయ సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలని, లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వీణూ అనిల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో ఆఫీస్ నుండి రామ్మోహన్ రావు తదితర అధికారులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

### అవయవ దానం మహాదానం..

# పునర్జన్మకు ప్రాణదానం: డాక్టర్ శివరామ్

- ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు
- ముఖ్య అతిథిగా మునిసిపల్ చైర్పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్




**కల్వకుర్తి,ఆగస్టు 13,(జనంసాక్షి):** ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బృంగి రత్నమాల మాట్లాడుతూ.."అవయవ దానం మహాదానం" అని పేర్కొన్నారు. ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసే అవయవాలు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపగలవని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అవయవ దానంపై అవగాహన పెంచుకొని, ఇతరులకు పునర్జన్మ ప్రసాదించే మహత్తర కార్యంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య, అందేలా చర్యలు తీసుకోవాలి

- కొత్తకోట మండలం అమడబాకులలో మైనారిటీ గురుకుల కళాశాలలో వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి బ్యూరో ఆగస్టు 13 (జనంసాక్షి): కొత్తకోట మండలం అమడబాకులలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా బోధన, నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు.

ముందుగా కళాశాలలోని స్టాక్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యత, నిల్వలు, సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, సరుకులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలని సూచించారు.

అనంతరం కళాశాలలోని భోజనశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చూడాలని, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి కళాశాలలో అందుతున్న విద్య, వసతులు, భోజనం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో నెలకొన్న విద్యుత్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, విద్యుత్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి ఆరోగ్యం, భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఈ డి ఎస్ సి కార్పొరేషన్ సిరాజుద్దీన్, ఇతర అధికారులు తదితరులు, కలెక్టర్ వెంట ఉన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ప్రాణాలు కాపాడిన మక్తల్ పోలీసులు



మక్తల్, ఆగస్టు 13 (జనంసాక్షి): కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై, రైల్వే ట్రాక్‌పై పడి ఆత్మహత్య చేసుకుంటానన్న ఓ వ్యక్తిని మక్తల్ పోలీసులు సకాలంలో స్పందించి సురక్షితంగా కాపాడారు. జక్లేరు గ్రామానికి చెందిన నరసింహ కుటుంబ గొడవల కారణంగా తన భార్య మంగమ్మకు ఫోన్ చేసి, తాను రైల్వే ట్రాక్‌పై పడి చనిపోతున్నట్లు తెలిపాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన మంగమ్మ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో మక్తల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు సమాచారం అందించింది. విషయం తెలిసిన వెంటనే మక్తల్ ఎస్ఐ రాజు ఆలస్యం చేయకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎస్ఐ ఆదేశాల మేరకు బ్లూకోల్ట్, పెట్రోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది జక్లేరు గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. ట్రాక్‌పై ఉన్న నరసింహను గుర్తించిన పోలీసులు అతనితో చాకచక్యంగా మాట్లాడి, కౌన్సిలింగ్ ఇచ్చి సురక్షితంగా అక్కడ నుంచి స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆవేశంలో ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవద్దని, కుటుంబ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు. అనంతరం అతడిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన మక్తల్ పోలీసుల సమయస్ఫూర్తిని ఉన్నతాధికారులు అభినందించగా, కుటుంబ సభ్యులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హర్ ఘర్ తిరంగా యాత్రలో

# 80 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల భారీ ర్యాలీ

- దేశ సమగ్రత, ఐక్యతను కాపాడే తరంగా యువత ఎదగాలి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ







వనపర్తి బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి): దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సమగ్రతను చాటుతూ వనపర్తి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కన్వీనర్ బచ్చు రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, యువత, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 80 మీటర్ల భారీ జాతీయ జెండాను విద్యార్థులు చేతబట్టి పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీగా సాగారు.

వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ వివేకానంద చౌరస్తా, శంకర్‌గంజ్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్, రాజీవ్ చౌక్ మీదుగా శివాజీ చౌరస్తా వరకు కొనసాగింది. విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని 'భారత్ మాతాకీ జై', 'వందే మాతరం' నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు. భారీ జాతీయ జెండాతో సాగిన ర్యాలీ పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. ప్రజలు, వ్యాపారులు, మహిళలు, యువత ర్యాలీని ఆసక్తిగా తిలకిస్తూ జాతీయ జెండాకు గౌరవం తెలిపారు.

**దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే...**

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు దేశం పట్ల బాధ్యత, జాతీయ భావన, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. దేశద్రోహానికి పాల్పడే తరంగా కాకుండా దేశం కోసం, దేశ సమగ్రతను కాపాడే తరంగా యువత ఎదగాలని పిలుపునిచ్చారు.

దేశాన్ని బలంగా, ఐక్యంగా ఉంచడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం కోసం అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను నేటి యువత గుర్తుంచుకోవాలని సూచించారు. జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది దేశ గౌరవం, స్వాతంత్ర్యం, త్యాగం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.

**ప్రతి ఇంటా జాతీయ భావన పెంపొందించాలి...**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యమని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రతి కుటుంబం జాతీయ జెండాను గౌరవంగా ఎగురవేసి దేశ స్వాతంత్ర్య విలువలను గౌరవించాలని కోరారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ఐక్యతను కాపాడేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు.

**భారీగా పాల్గొన్న బీజేపీ నాయకులు...**

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బొక్క బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుద్దన్న, శ్రీశైలం, మెంటం పల్లి పురుషోత్తం, రామన్న, గారి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అనుజ్ఞ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మున్నూరు రవీందర్, కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, కల్పన, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భాషటి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ సుమిత్రమ్మ, అలివేలు, 26వ వార్డు కౌన్సిలర్ విజయ్, జిల్లా కార్యదర్శి సూర్యాదవ్, కృష్ణ గౌడ్, సరోజ, బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, అధికార ప్రతినిధి నక్క మహేష్, దాసరాజుల ప్రవీణ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, మహిళా మోర్చా నాయకురాలు కవిత, యువమోర్చా అధ్యక్షుడు అరవింద్, మైనార్టీ మోర్చా నాయకుడు ఖలీల్, బత్తిని మధుసూదన్, కంచరవి, మోహన్ సాగర్, తిరుపతయ్య, రాయన్న సాగర్, శివకుమార్, నవీన్, చందు, చిన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ నియామకాల్లో మేడ్చల్ యువతకు న్యాయం చేయాలి

- బీజేపీ నేతలు ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లాల తిరుమల్ రెడ్డి డిమాండ్
- జిల్లా ప్రాతిపదికన నియామకాలతో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు పెంచాలి




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** పోలీస్ ఉద్యోగ నియామకాల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువతకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సరిదిద్దాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లాల తిరుమల్ రెడ్డి డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ నియామకాల విషయంలో ప్రస్తుత విధానాల కారణంగా మేడ్చల్ జిల్లాకు చెందిన యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా పరంగా రాష్ట్రంలోనే పెద్ద జిల్లాల్లో ఒకటైన మేడ్చల్--మల్కాజిగిరిలో పోలీస్ స్టేషన్లు, సిబ్బంది అవసరం అధికంగా ఉన్నప్పటికీ, స్థానిక యువతకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో సివిల్, ఏఆర్ పోస్టుల భర్తీ జనాభా, ఖాళీలు, పోలీస్ స్టేషన్ల అవసరాల ఆధారంగా జరుగుతున్న నేపథ్యంలో మేడ్చల్ జిల్లాకు చెందిన అభ్యర్థులకు ఎక్కువ అవకాశాలు లభించేలా నియామక విధానాన్ని రూపొందించాలని కోరారు. జిల్లా సరిహద్దుల ఆధారంగా పోలీస్ నియామకాలు చేపట్ట డంతో పాటు మేడ్చల్‌కు ప్రత్యేక పోలీస్ పరిధి అవసరమని పేర్కొన్నారు. గతంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రి భువన గిరి జిల్లాలు ఉండటంతో స్థానికత ప్రభావితం అయిందని తెలిపారు. ప్రస్తుతం మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఏర్పాటైనప్పటికీ, స్థానిక యువతకు మరింత ప్రయోజనం చేకూరేలా విధానపరమైన మార్పులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఎస్ఐ నియామకాల్లో అమలవుతున్న జోనల్ విధానాన్ని కూడా ప్రభుత్వం పునఃపరిశీలించాలని సుదర్శన్ రెడ్డి కోరారు. భౌగోళిక, పరిపాలనా పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలను ఒకే జోన్‌లో చేర్చేలా జోన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సూచించారు. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల యువతకు ఉద్యోగ అవకాశాల్లో సముచిత వాటా దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడే విధంగా పోలీస్ కమిషనరేట్‌లు, జోన్ల పరిధులను పునః సమీక్షించాలని కోరిన వారు, మేడ్చల్ జిల్లా యువతకు న్యాయం జరిగే వరకు ఈ అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# రైతుల పంట భూమిలోకి విషం నీరు

### బోర్ కేసింగ్ పైపుల ద్వారా భూమిలోకి..
### దివ్యశక్తి పేపర్ మిల్ యాజమాన్యం నిర్వాకం





**జిల్లెడ్ చౌదరిగూడ (జనంసాక్షి) :** ఉమ్మడి కొందుర్గు మండలంలో దివ్యశక్తి అనే పేపర్ మిల్ యాజమాన్యం ఇక్కడి ప్రాంత రైతుల పంట భూమిలోకి విషం నీరు పంపిస్తోంది. పేపర్ కంపనీలో నిల్వగా ఉన్న రసాయనాలు కలిసిన కలుషిత నీటిని భూమిలోకి బోర్ కేసింగ్ పైపు ద్వారా రంధ్రం చేసి భూమిలోకి పంపుతున్నారు. దీని ద్వారా పక్కనున్న రైతుల భూముల్లోకి నీరు చేరి పంటలు పాడవుతున్నాయని వాపోతున్నారు. తాగే నీటికోసం బోరు వేసుకోవాలన్నా విషపు నీరు వస్తోందని భయాందోళనకు గురవుతున్నారు. దివ్యశక్తి పేపర్ మిల్ యాజమాన్యంకు తమ పంట భూములు పాడవుతున్నాయని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతు జిలేళ్ల బాలరాజు ( జోసఫ్) ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఆ కంపెనీ యాజమాన్యంపై రాష్ట్ర కాలుష్యం నియంత్రణ అధికారులకు పిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కొన్ని కంపెనీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# విద్యార్థులకు అండగా జివిఆర్ చారిటబుల్ ట్రస్ట్

### చండూరు ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ యూనిఫాంలు, బీరువా అందజేత



**చిలప్ చేడ్, 13ఆగస్టు (జనంసాక్షి) :** మండలంలోని చండూరు జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు క్రీడలను ప్రోత్సహించేందుకు జివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ముందుకు వచ్చింది. జివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చౌటకూరి గోవర్ధన్ రెడ్డి గురువారం చండూరు ఉన్నత పాఠశాలలో 52 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంలను అందజేశారు. అదేవిధంగా పాఠశాల అవసరాల కోసం ఒక బీరువాను కూడా అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫాంలను అందజేసి, వారి క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు చేపడుతున్న జివిఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జివిఆర్ ట్రస్ట్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, జగత్ వర్ధన్ రెడ్డి, చండూరు సర్పంచ్ శేషాద్రి, ఉపసర్పంచ్ వెంకటేశం, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

### తహసీల్దార్‌కు యుఎస్‌పీసీ ఆధ్వర్యంలో వినతిపత్రం

**చిలప్‌చేడ్, 13 ఆగస్టు (జనంసాక్షి) :** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పీసీ) ఆధ్వర్యంలో చిలప్‌చేడ్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెల్లి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘాలు ఐక్యంగా పోరాడుతాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలప్‌చేడ్ మండల కాంప్లెక్స్ హెచ్ఎం ధనమూర్తి, టీఎస్‌యూటీఎఫ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత, కోశాధికారి అజయ్ కుమార్, జిల్లా నాయకురాలు పద్మజ, మండల అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి ఆదినారాయణ, నాయకులు శ్రీను, మహేష్, విష్ణువర్ధన్, రంజిత్ కుమార్, శోభి తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ గురుపీఠంలో భక్తుల శ్రావణ పూజలు

**శివ్వంపేట ఆగస్ట్ 13 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలోనీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ గురుఫితానికి శ్రావణమాసం మొదటి గురువారాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాతో పాటుగా వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గురు పీఠంలో కొలువైన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, అలాగే సాయిబాబా దేవాలయంలో మూలమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు శాస్త్రుల నటరాజ్ శర్మ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది, శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఫౌండర్ వ్యవస్థాపకులు జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతుల పర్యవేక్షణలో భక్తులు శ్రీ గురు పీఠంలో కొలువుదీరిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామికి పంచామృతాభిషేకాలు, అర్చన, వివిధ రకాల పూజలు చేపట్టారు. అనంతరం షిరిడి సాయిబాబాకు అభిషేకం, మధ్యాహ్న హారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం శ్రీ గురు పీఠం ట్రస్టు ద్వారా అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులు మాట్లాడుతూ ఇ టువంటి మహత్తరమైన మందిరాలు నిర్మించి, అందులో నిత్యం భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, షిరిడి సాయిబాబాలను చూస్తుంటే సాక్షాత్తు దివి నుండి భూవికి దిగివచ్చి మనతో మాట్లాడుతున్నట్లుగా ఉందన్నారు. ఇంతటి మహాత్ భాగ్యాన్ని భక్తులకు కల్పించిన గురుపీఠం ట్రస్ట్ చైర్మన్ జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణగౌడ్, శ్రీ మాజీ సర్పంచ్ స్వరాజ్ లక్ష్మి శ్రీనివాస్ గౌడ్, శ్రీ గురు పీఠం ట్రస్ట్ సభ్యులు రాజం భిక్షపతి యాదవ్, మధు యాదవ్, ఆంజనేయులు యాదవ్, శివ్వంపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, పీఠం కోఆర్డినేటర్ కే. సత్యనారాయణ గౌడ్ లతో పాటు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.